PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 181 | విజయవాడ, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 5 February 2024 | Rs

ప్రజా ఉద్యమాలు విస్తృతమవ్వాలి

- లెనిన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి
- లెనిన్ శత వర్ధంతి సభలో సీతారాం ఏచూరి

5

6

ముగించేదెవరు?

- భారత్‌కు 9 వికెట్లు, ఇంగ్లాండ్‌కు 332 పరుగులు

ఉత్తరప్రదేశ్‌లో ఉత్తుత్తి పెళ్లిళ్లు

సామూహిక వివాహాల మాటున బిజెపి నేతల భారీ దోపిడీ
ఇద్దరు అధికారులతో సహా 15 మంది అరెస్టు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంలో అవినీతికి హద్దులేకుండా పోతోంది. సామూహిక వివాహాల మాటున భారీ దోపిడీ బాగోతం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. ఉత్తుత్తి వివాహాలు జరిపించి భారీగా ప్రభుత్వ సొమ్మును కాజేసిన వైనం విస్మయానికి గురిచేస్తోంది. పెళ్లయి భార్యాపిల్లలున్న వ్యక్తులు, వివాహితలు, మైనర్లు... ఇలా అందరికీ వివాహాలు జరిపించేయడం, వరుడు లేకున్నా.. వధువులు తమంతట తామే మెడలో పెళ్లి దండ వేసేసుకోవడం... ఇలాంటి విచిత్రాలతో కూడిన సామూహిక వివాహాల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జనవరి 31న వీడియో వైరల్ అయ్యే వరకూ ఎవరూ పట్టించుకోలేదు. సామూహిక వివాహాల్లోనూ యోగి ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఉత్తర ప్రదేశ్‌లోని బలియా జిల్లా మణియార్ ఇంటర్ కాలేజిలో జనవరి 25న జరిగిన సామూహిక వివాహాల్లో అవకతవకలకు బాధ్యులుగా పేర్కొంటూ సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మరో ప్రభుత్వ అధికారిసహా 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సామూహిక వివాహాల్లో ముఖాలు కనిపించకుండా వరుడు, వధువు ముసుగులు ధరించడం, కొందరు వధువులు తమ మెడలో తామే పూలమాల వేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో జాతీయ మీడియా ఈ అంశంపై దృష్టిపెట్టడంతో

సామూహిక వివాహాల్లో మహిళలు ఒక్కరే ఉన్న దృశ్యం

మోసం వెలుగుచూసింది. సామూహిక వివాహాలు చేసుకున్న వారిలో చాలామందికి ఇప్పటికే పెళ్లిళ్లయ్యాయని స్థానికులు తెలిపారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జనవరి 25న 568 జంటలకు సామూహిక వివాహ కార్యక్రమాన్ని బిజెపి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించింది. మణియార్ జిల్లాలో ఈ కార్యక్రమానికి బిజెపి ఎమ్మెల్యే కేత్కీసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వధూవరులుగా నటించేందుకు కొందరికి డబ్బులిచ్చినట్లు తేలిందని అధికారులు తెలిపారు. యుపి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం వివాహం చేసుకున్న జంటకు చీఫ్ మినిస్టర్స్ మాస్ మ్యారేజ్ స్కీమ్ కింద రాష్ట్రప్రభుత్వం రూ.51,000 కేటాయిస్తుంది. ఇందులో రూ.35,000 వధువుకు, రూ.10 వేలు వివాహానికి అవసరమైన సామగ్రికి, కార్యక్రమం నిర్వహించేందుకు రూ.6,000 కేటాయిస్తారు. వధూవరులుగా నటించిన ఒక్కొక్కరికీ రూ.500 నుంచి రూ.2000 వరకు చెల్లించారని స్థానికుడు విమల్ కుమార్ పాఠక్ చెప్పారు. పెళ్లిళ్లు చూసేందుకు వచ్చిన కొందరిని వధూవరులుగా కూర్చోబెట్టారని ఆయన తెలిపారు. కొందరు మహిళలు తమ మెడలో తామే మాల వేసుకున్నారని చెప్పారు. 19 ఏళ్ల యువకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ పెళ్లి చూసేందుకు వచ్చిన తనను మిగతా 3లో

నేటి నుంచి అసెంబ్లీ

- తొలిరోజు గవర్నరు ప్రసంగం
- 7న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. 24-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్నికల ఏడాది కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంటు బడ్జెట్‌ను ఈ నెల 7న ప్రవేశపెట్టనుంది. ఉదయం 8 గంటలకు కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర ఆర్థికశాఖ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. మొదటిరోజు గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఉదయం పది గంటలకు గవర్నరు ప్రసంగం ప్రారంభమవుతుంది. అనంతరం సభ వాయిదా వేయనున్నారు. గవర్నరు ప్రసంగం, ఓటాన్ అకౌంట్, బిల్లుల ఆమోదానికి సంబంధించి సమావేశం ఎన్నిరోజులు నిర్వహించాలనేది సోమవారం ఉదయం జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బిఎసి)లో నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో ల్యాండ్ బిల్లుపైనా చర్చించనున్నారు. డిఎస్‌సి పోస్టుల భర్తీ, పెట్టుబడులు, డిబిటి తదితర అంశాలపై స్వల్పకాలిక చర్చలూ జరపనున్నారు.

ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనతో భేటీ అయిన పవన్ కల్యాణ్

జనసేనకు 28 సీట్లు..!

- చంద్రబాబుతో పవన్ రెండు సార్లు భేటీ
- సీట్ల సర్దుబాటు కొలిక్కి
- వారంలో ఉమ్మడి మేనిఫెస్టో
- గోదావరి జిల్లాల్లో భారీగా ఉమ్మడి బహిరంగ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఆదివారం నాడు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో పవన్‌కల్యాణ్‌తో రెండు పర్యాయాలు జరిగిన భేటీలో సీట్ల సర్దుబాటుపై దాదాపు 3 గంటలపాటు చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో జనసేనకు 28 సీట్లను ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో జనసేన పార్టీలోకి చేరికలు పెరగడంతో సీట్లపై ఒత్తిడి ఎక్కువగా వుందని, తమకు అధిక స్థానాలు కేటాయించాల్సిందేనని పవన్‌కల్యాణ్ పట్టుబట్టినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో పొత్తు అనేది ప్రత్యర్థి వైసిపి గెలుపునకు బాటలు వేసేలా ఉండకూడదని, గెలిచే సీట్లను మాత్రమే కోరాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. అలాగే ఎవరెవరు, ఏయే స్థానాల్లో పోటీ చేయాలనే అంశంపై ఇరుపక్షాల నేతలు చర్చించారని, దీనిపై దాదాపు ఓ క్లారిటీకి వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా, జనసేన, టిడిపి మధ్య ఓటు బదలాయింపు సక్రమంగా జరిగేందుకు క్షేత్రస్థాయి వరకు కలిసే వెళ్లేలా కార్యక్రమాలను రూపొందించేందుకు ప్రణాళికలు తయారుచేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీల పరంగా ఓట్లు పక్కకు వెళ్లకుండా తెలుగుదేశం ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి, జనసేన ఎన్ని సీట్లలో అభ్యర్థులను బరిలోకి దింపాలి అనే విషయంపై దాదాపు క్లారిటీ వచ్చేసినట్లేనని తెలియవచ్చింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే వారంలోపు ఉమ్మడిగా మొదటి విడతకు సంబంధించిన అభ్యర్థుల జాబితా విడుదల చేసే అవకాశాలున్నాయని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఇటీవల పొత్తుకు సంబంధించి వచ్చిన విమర్శలు, కామెంట్లపై కూడా చర్చ జరిగిందని సమాచారం. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి సభలపై కూడా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. వీటికి సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటన అనంతరం ఉమ్మడి బహిరంగ సభను గోదావరి జిల్లాల్లో భారీగా జరిపేలా నిర్ణయించినట్లు సమాచారం. ఉండవల్లిలో చంద్రబాబుతో సుదీర్ఘంగా చర్చలు జరిపిన పవన్‌కల్యాణ్ సాయంత్రం మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లి వైసిపి ఎంపి బాలశౌరిని పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం పవన్‌కల్యాణ్ రాత్రి రెండోసారి చంద్రబాబు ఇంటికెళ్లి అక్కడి విందులో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏ అంశంపై అయినా ఉమ్మడిగా వెళ్లేలా నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

అప్పుల బాధతో భార్యాభర్తల ఆత్మహత్య

ప్రజాశక్తి- పెనుగొండ (ఏలూరు జిల్లా)

పడవల సత్యనారాయణ, లక్ష్మి

అప్పుల బాధతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన పడవల సత్యనారాయణ (54)కు భార్య లక్ష్మి (50), ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన గ్రామంలో చిన్న బట్టల షాపు నడిపేవారు. నష్టాలు రావడంతో అప్పుల పాలై ఈ షాపును అమ్మేశారు. పెనుగొండలోని ఓ బట్టల దుకాణంలో పనికి చేరారు. ఆయన ఇద్దరి మేనమామలు కొంత ఆర్థిక సాయం చేశారు. అయినా, అప్పులు తీరలేదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబంతో సహా గ్రామంలోని శాలిపేటలోగల తన మేనమామల ఇంట్లోకి సత్యనారాయణ కుటుంబంతో సహా మకాం మార్చారు. అయినా, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతుండడం, అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో భార్యాభర్తలు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి వేర్వేరు గదుల్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రూ.ఐదు లక్షలకుపైగా అప్పు ఉందని, ఆర్థిక సమస్యలు ఎక్కువై ఆత్మహత్యకు చేసుకుంటున్నామని, తమ ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కాదని ఈ నోట్‌లో వారు పేర్కొన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సత్యనారాయణ తన ముగ్గురి పిల్లలకు ఇది వరకే వివాహం చేశారు.

మెగా డిఎస్‌సి నిర్వహించాలి

- నిరుద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని, వెంటనే మెగా డిఎస్‌సి నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీలు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వాగ్దానాన్ని అమలు చేస్తారని ఎదురుచూసిన వారికి తాజా ప్రకటన నిరాశపరిచిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యా అనుబంధ రంగాల పోస్టులన్నీ భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా వైసిపి అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సి ప్రకటించి నిరుద్యోగులకు కానుకగా ఇస్తామని ప్రకటించడంతో నిరుద్యోగ యువత ఎంతో నమ్మకం పెట్టుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేని విధంగా ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదని విమర్శించారు. సుదీర్ఘకాలంగా యువజన సంఘాలు, నిరుద్యోగ యువత పోరాడిన ఫలితంగా కంటి తుడుపు చర్యగా 6,100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించార న్నారు. ఇవి కూడా అన్ని జిల్లాలు, కేటగిరీలను సమగ్రంగా రూపొందించలేదని పేర్కొన్నారు. డిఎస్‌సి ప్రకటించిన వాటిలోనూ అనేక నిబంధనలు పెట్టారని, ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని పునఃప్రవేశపెట్టి రెండేళ్లు గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించడం అన్యాయమని అన్నారు. గడిచిన నాలుగేళ్లుగా కొత్తగా ఉద్యోగాల కోసం రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకొని నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన సంఖ్యను చూసి లక్షలాది మంది యువత నిరుత్సాహం చెందుతున్నారని అన్నారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టులతోపాటు రానున్న జూన్‌లో మరిన్ని పోస్టులు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని సుమారు 32 వేల పోస్టులు ఖాళీగా ఉండొచ్చని, దీనికోసం మెగా డిఎస్‌సి ప్రకటించాలని కమిటీ డిమాండ్ చేశారు. అభ్యర్థుల వయోపరిమితిని సడలించాలని, పోస్టుల భర్తీ కోసం న్యాయబద్ధంగా ఆందోళన చేసిన యువజన సంఘాల నాయకులు, అభ్యర్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

మెగా డిఎస్‌సి నిర్వహించాలని ఆందోళన చేస్తున్న యువత (ఫైల్)

జనసేనలో చేరిన బాలశౌరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లాలో అధికార వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నేత, మచిలీపట్నం ఎంపి బాలశౌరి వైసిపి వీడి జనసేనలో చేరారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో బాలశౌరి, ఆయన కుమారుడు అనుదీప్ తదితరులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పవన్‌కల్యాణ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని విమర్శించారు. సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి, మద్యనిషేధం వంటి వాటిని అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఒపిఎస్ సాధనే ఎజెండా

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

తెలుగు ప్రజలు ఎక్కడున్నా మనవారే...

- పద్మ అవార్డు గ్రహీతలకు ప్రతినెలా రూ.25వేల పింఛను
- పద్మ అవార్డు గ్రహీతలకు తెలంగాణ సిఎం రేవంత్ సన్మానం

• లోపలి పేజీలో.. •

పంచ గ్రామాలపై నిర్లక్ష్యం

భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి- వేపగుంట, సింహాచలం (విశాఖపట్నం)

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ బాధిత రైతులు, ప్రజలు ప్ల కార్డులతో ఆదివారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వేపగుంట జంక్షన్ ముత్యాలమ్మ అమ్మవారి గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ సింహాచలంలోని తొలి పావంచా వరకూ సాగింది. సుమారు 25 ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించకపోతే రానున్న కాలంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాలకుల మోసపూరిత వైఖరిని నిరసించారు. భూ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో తాము కొత్తగా ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని, కుటుంబ అవసరాలకు ఇంటిని అమ్ముదామన్నా కుదరడం లేదని వాపోయారు. ఇళ్ల స్థలాల యజమానులను, సాగుదారులను హక్కుదారులుగా గుర్తించాలని, 1903 సర్వే సెటిల్‌మెంట్ (గిల్‌మెన్) రికార్డు ఆధారంగా భూ సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం సింహాచలం వద్ద మానవహారం నిర్వహించారు. దీనికి ముందు సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ పంచగ్రామాల సమస్య పరిష్కారానికి పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. ఎన్నికల ముందు హడావుడిగా జిఒలు విడుదల చేస్తున్నారని, ఆ తర్వాత వాటిని గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాజకీయాలకు అతీతంగా తమ సంఘం నుంచి తమ ప్రతినిధిగా ఒక అభ్యర్థిని నిలిపి గెలిపించుకొని ప్రధాన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిఎన్.ప్రతాప్, కెఆర్‌కె.ప్రసాద్, బి.శంకర్రావు, వి.హనుమంతరావు, పంచగ్రామాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అడవివరం, వెంకటాపురం, వేపగుంట, చీమలాపల్లి, పురుషోత్తపురం గ్రామాలను పంచగ్రామాలుగా పిలుస్తున్నారు. ఈ గ్రామాల పరిధిలో 25 వేల కుటుంబాలకు చెందిన సుమారు లక్షమంది నివాసం ఉంటున్నారు. 2010లో విశాఖ ఆర్‌డిఒ ఇచ్చిన ఆర్డర్, 2014లో ముగ్గురు ఉన్నతాధికారుల కమిటీ ఇచ్చిన రిపోర్టు, 1903 సర్వే సెటిల్‌మెంట్ (గిల్‌మెన్) రికార్డు ప్రకారం ఈ గ్రామాల్లోని భూములపై తమకు పూర్తి హక్కు కల్పించాలని రైతులు, ప్రజలు పోరాడుతున్నా పాలకులు స్పందించడం లేదు. 1996-97లో విశాఖ ఆర్‌డిఒ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ భూములపై తమకు మాత్రమే అధికారం ఉందని సింహాచలం దేవస్థానం అధికారులు వాదిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు, నివాసదారులకు అనుకూలంగా వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు.

ర్యాలీ నిర్వహిస్తున్న పంచ గ్రామాల ప్రజలు

పూణె వర్సిటీలో 'రామ్‌లీలా' వివాదం

- నాటక బృందంపై ఎబివిపి గూండాల దాడి
- విద్యార్థులనే అరెస్టు చేసిన పోలీసులు
- ఖండించిన ప్రొఫెసర్ల సంఘం

పూణే : సావిత్రీబాయి పూలే పూణే విశ్వవిద్యాలయం (ఎస్‌పిపియు)లో 'రామ్‌లీలా' నాటక బృందంపై 'అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) గూండాలు దాడి చేశారు. పైగా తమపైనే దాడి జరిగిందని పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుపై ఏ మాత్రం విచారణ చేయకుండానే పోలీసులు వారు చెప్పినట్లే నడుచుకున్నారు. ఒక ప్రొఫెసర్, ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. వీరికి పూణే కోర్టు బెయిల్ మంజూరు చేయడం కొంత ఊరట కలిగించింది. అక్రమ అరెస్టులను యూనివర్శిటీ ప్రొఫెసర్ల సంఘం తీవ్రంగా ఖండించింది. విద్యార్థులు, ప్రొఫెసర్లు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎస్‌పిపియులో శుక్రవారం సాయంత్రం 'జెబ్ వియ్ మెట్' పేరుతో లలిత కళా కేంద్రం (సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్) ఒక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా కొంత మంది విద్యార్థులు 'రామ్‌లీలా' అనే ఒక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంతో తమ మతపరమైన మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ ఎబివిపి గూండాలు నాటక బృందంతో ఘర్షణకు దిగారు. భౌతిక దాడులకు పాల్పడ్డారు. దీంతో నాటకం నిలిపివేశారు. నాటక బృందంపై దాడికి పాల్పడ్డ ఎబివిపి గూండాలే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఒక ప్రొఫెసర్, ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారకుండా యూనివర్శిటీలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

శనివారం సాయంత్రం పూణే కోర్టు వీరికి బెయిల్ మంజూరు చేసింది. ఈ అక్రమ అరెస్టులను ప్రొఫెసర్ల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ వివాదంపై ఎస్‌పిపియు యాజమాన్యం స్పందించింది. ఈ ఘటనపై విచారణ కోసం రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షతన నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని విశ్వవిద్యాలయం ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి - ఆచంట (పశ్చిమగోదావరి జిల్లా)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. కరుగోరుమిల్లి పంచాయతీ పరిధిలోని ముత్యాలవారిపాలెంకు చెందిన నక్కా వాసుదేవ (13) ఎనిమిదో తరగతి, కుక్కల నాగరాజు (12) ఏడో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ కలిసి ఆచంట నుంచి కోడేరుకు ట్రక్కు ఆటోలో వెళుతున్నారు. కోడేరు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో, విద్యార్థులు నాగరాజు, వాసుదేవ అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న ఐదుగురు ప్రయాణికులు కుక్కల విశ్వనాథం, కుక్కల కృష్ణవేణి, నేలపూడి జయ, సుశాంత్‌కుమార్, అచ్యుత్ నారాయణమూర్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ రాజ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

తహశీల్దారు హత్యతో రెవెన్యూ ఉద్యోగుల్లో భయాందోళనలు

- ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తహశీల్దారు రమణయ్య హత్యతో రెవెన్యూ ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలు కనిపిస్తున్నాయని, విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేయాలనే ఆలోచనే రాకుండా చట్టాలను కఠినతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని గవర్నర్‌పేట రెవెన్యూ భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ పలు తీర్మానాలను ఆమోదించింది. తహశీల్దారు రమణయ్య హత్యను తీవ్రంగా ఖండించడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపింది. హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూ వివాదాలు ఉన్న మండలాల తహశీల్దార్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టం తీసుకురావాలని తీర్మానించారు. ఎన్నికల ప్రకియ సందర్భంగా ఉద్యోగులు/అధికారులపై వచ్చే ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఉద్దేశ పూర్వకంగా తప్పు జరిగినట్లు రుజువు కాబడిన సందర్భంలో మాత్రమే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశం పేర్కొంది. చిన్నచిన్న విధానపరమైన లోపాలపై తీవ్రమైన చర్యలు తీసుకోవడంతో ఉద్యోగులు అభద్రతా భావం కలిగి, మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని రాష్ట్ర కార్యవర్గం భావించింది.

మణిశంకర్ అయ్యర్ కుమార్తెపై కేసు

న్యూఢిల్లీ : ఒక వర్గం మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ కుమార్తె సురన్యాపై కేసు నమోదైంది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను ఉద్దేశించి ఆమె గత నెల 20న సోషల్ మీడియాలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. భిన్న మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే ఉద్దేశంతో చేస్తున్న కార్యకలాపాలను నిరసిస్తూ మూడు రోజుల పాటు ఉపవాసం ఉంటున్నట్లు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. న్యాయవాది, బిజెపి నేత అజేయ్ అగర్వాల్ ఢిల్లీ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేయగా.. ఎఫ్ఐఆర్ నమోదైంది.

పుస్తకాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి

- మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తిగల పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో దొరుకుతాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని విలేకరుల కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. బుక్‌హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన బుక్‌స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పుస్తకాల అవసరం సమాజానికి చాలా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ సాహిత్యం అనేక దశలను దాటుకుంటూ నేటి స్థితికి చేరుకుందని, మూఢనమ్మకాలపై ఎక్కు పెట్టాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. ఇందుకు సాధనాలైన పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో దొరుకుతాయని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ.. మతతత్వానికి, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో ప్రజల సాధానంగా ప్రజాశక్తి పనిచేస్తోందని తెలిపారు. అటు పత్రిక రంగంలోనూ.. ఇటు సాహిత్య రంగంలోనూ ప్రజాశక్తి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ చైర్మన్ వి.కృష్ణయ్య మాట్లాడుతూ పుస్తకాల్లో అమూల్యమైన సమాచారం ఉంటుందని, పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ.. అభ్యుదయ పుస్తకం మంచి మిత్రుడని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, దేశం ఎలా ముందుకు వెళుతున్నది అనేది పుస్తకాల ద్వారానే తెలుస్తుందన్నారు. అనంతరం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ జి.శివరామకృష్ణయ్య, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాష్‌రావు మాట్లాడారు. తొలుత 'రాష్ట్ర ప్రాజెక్టులు- నీటి వనరులు' పుస్తకాన్ని మంత్రి రాంబాబుకు వి.కృష్ణయ్య బహూకరించారు. మున్సిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మి తులసి సాంబశివరావు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ విజయవాడ మేనేజర్ బి.శ్రీనివాస్, ప్రజాశక్తి సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటును ఆయుధంగా వాడండి

- కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె పద్మనాభయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటును ఆయుధంగా వాడి ఆదర్శ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలకు కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె పద్మనాభయ్య పిలుపునిచ్చారు. విజయవాడలోని ఓ ఫంక్షన్ హాలులో 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ డిక్లరేషన్ పేరుతో ఆంధ్రప్రదేశ్ ఓటర్లకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ, సేవా సంస్థల ఉమ్మడి విజ్ఞప్తి కరపత్రాన్ని పద్మనాభయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటును ప్రాథమిక హక్కుగా గుర్తించి ప్రతిఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించాలన్నారు. గత పాలకులు సమాజ సేవకులుగా ప్రవర్తిస్తే నేడు రాజకీయాల్లోకి క్రిమినల్స్, అవినీతిపరులు అత్యధిక సంఖ్యలో వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ అభ్యర్థి రూ.100 కోట్లకు పైగా వెచ్చించే స్థితికి రాజకీయాలు లాభాపేక్షతో కూడిన వృత్తిగా మారాయని విమర్శించారు. ఓటును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా రాజకీయాల్లో సమూల మార్పులు తేవొచ్చన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డు ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటర్ల క్రియాశీలత భాగస్వామ్యమే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాయి అని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలు, విద్యాధికుల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ధ్వంసమైన వ్యవస్థలను పునర్నిర్మాణం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిటైర్డు ఐఎఎస్ అధికారి పివి రమేష్ మాట్లాడుతూ.. కులం, మతం, విద్య, ఆర్థిక, లింగ వివక్షకు అవకాశం లేకుండా రాజ్యాంగం 1950లోనే 21 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటుకు ప్రభుత్వాలు మార్చే శక్తి ఉందని అనేకసార్లు రుజువు చేసిందన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరిగే రాష్ట్రంగా ఎపి రూపొందిందన్నారు. రాష్ట్రంలోని ఓటర్లను జాగృతం చేసేందుకు ఈ నెల 25 నుంచి అన్ని జిల్లాల్లో కళాజాతాను నిర్వహిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు జి సమరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంధ సంస్థలు, సేవా సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పూర్వ మేయర్ జంద్యాల శంకర్, విద్యావేత్త ఎంసి దాస్, విద్యారంగ సేవకులు దేవినేని జయశ్రీ, మాజీ సైనిక సంఘం కార్యదర్శి ఎం శంకర్‌రావు, ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి భాస్కరరావు, ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ వైవి ఈశ్వరరావు, రిటైర్డు ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, ఎపి లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద, ఎపి గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై రామచంద్ర రావు, రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పట్టాభి రామయ్య, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముఖ్య నేతలతో ఎమ్మెల్యే వసంత భేటీ

- నేడు భవిష్యత్ కార్యాచరణ

ప్రజాశక్తి-మైలవరం

కృష్ణా జిల్లా మైలవరం రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మైలవరం సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వైసిపిని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నందిగామకు చెందిన వసంత కృష్ణప్రసాద్ 2019లో మైలవరం వైసిపి నుంచి పోటీ చేసి గెలుపొందారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వసంత కృష్ణప్రసాద్‌ను కాదని, మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా స్వర్ణాల తిరుపతిరావును వైసిపి అధిష్టానం ప్రకటించింది. అధిష్టానం తీరుపట్ల వసంత కృష్ణప్రసాద్ అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నందిగామ నియోజకవర్గం ఐతవరంలోని తన నివాసంలో ఆయన ఆదివారం మైలవరం నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చలు జరిపారు. సోమవారం మరికొందరు నాయకులతో మాట్లాడిన అనంతరం తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని విలేకరులకు తెలిపారు. ఇంకోవైపు వసంత కృష్ణప్రసాద్ టిడిపిలోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. కృష్ణ ప్రసాద్ రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో దేవినేని ఉమా మాట్లాడుతూ రాజకీయ భిక్షగాళ్లు వస్తున్నారని, వారిని తరిమికొట్టాలంటూ ఎమ్మెల్యే వసంత, ఎంపి కేశినేని నాని, సుజనా సోదరులను ఉద్దేశించి అన్నారు. దీనిని బట్టి వసంత టిడిపిలో చేరతారని ప్రచారం ఊపందుకుంది.

పద్మవిభూషణ్ చిరంజీవిని సన్మానిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

తెలుగు ప్రజలు ఎక్కడున్నా మనవారే...

- పద్మ అవార్డు గ్రహీతలకు ప్రతినెలా రూ.25వేల పింఛను
- పద్మ అవార్డు గ్రహీతలకు సిఎం సన్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు ప్రజలు ఏ ప్రాంతంలో ఉన్నా మనవారేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు రాజకీయాలకతీతంగా తెలుగు ప్రజలంతా ఏకమై ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్ శిల్ప కళావేదికలో ఆదివారం తెలంగాణ ప్రభుత్వం తరుపున ఎపింకైన పద్మవిభూషణ్ వెంకయ్యనాయుడు, పద్మవిభూషణ్ చిరంజీవి, పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన బుర్రవీణ కళాకారుడు కొండప్ప, చిందుయక్షగాన కళాకారులు గడ్డం సమ్మయ్య, సామాజికవేత్త కూరెళ్ల విఠలాచారి, శిల్పి అనంతాచారి, బంజారా సాహితీవేత్త సోమాలాల్, హరికథ కళాకారిణి ఉమా మహేశ్వరిలను సిఎం రేవంత్, మంత్రులు సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఒక మంచి సంప్రదాయానికి పునాది వేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. పద్మ అవార్డు గ్రహీతలైన గ్రామీణ కళాకారుల జీవితాలు అంత సుఖవంతంగా లేవని, వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.25 లక్షల పారితోషికంతో పాటు ప్రతి నెలా రూ.25 వేల పింఛన్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సీనియర్ నాయకుడు వెంకయ్యనాయుడు రాష్ట్రపతి కాకపోవడం తనకు బాధకలిగించిందని అన్నారు. దేశ రాజధానిలో తెలుగువారి నాయకత్వం పెరగాలని ఆకాంక్షించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ చిరంజీవికి పద్మ విభూషణ్ రావడం ఆయన కృషికి గుర్తింపు అని కొనియాడారు. కులం, వర్గం, ప్రాంతం ప్రాతిపదికగా రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ కళాకారులకు గద్దర్ పేరిట అవార్డులు ప్రకటించడం సముచితంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖర్చుకాని రూ.7,539 కోట్ల విద్యా రంగం బడ్జెట్

- సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనం నిధులే
- యుజిసికి తగ్గిన కేటాయింపులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం 2023-24లో విద్యారంగం నిధుల వ్యయం కంటే రూ.7,539 కోట్లు తగ్గించింది. పాఠశాల విద్యా రంగంలో సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనం వంటి కీలక పథకాలపై ఖర్చు చేసిన మొత్తం గత సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపు కంటే తక్కువగా ఉంది. బిజెపి రాజ్యసభ ఎంపి వినయ్ పి సహస్రబుద్ధే అధ్యక్షతన విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2022లో ఈ పథకాల నిర్వహణలో లక్ష్యంగా నిర్ణయించిన వ్యయాన్ని చేరుకోవడంలో లోటు గణనీయంగా ఉందని పేర్కొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఈ వివరాలు వెల్లడయ్యాయి. దీనిలో ప్రభుత్వం విద్య కోసం రూ.1.25 లక్షల కోట్లు కేటాయించింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో ఇప్పటివరకు ఖర్చు చేయగలిగే దానికంటే 14.47 శాతం ఎక్కువ. 2023-24లో ప్రభుత్వం విద్యపై రూ.1.16 లక్షల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. రూ.1.08 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఈ గ్యాప్ తప్పనిసరిగా సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనం (పిఎం పోషన్), పిఎం శ్రీ కింద ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధుల ఫలితమే.

ఉదాహరణకు, పాఠశాల విద్యలో అన్ని ప్రధాన విధానాలు, కార్యక్రమాలను కలిగి ఉన్న సమగ్ర శిక్ష అభియాన్ 2023-24లో రూ.37,453 కోట్ల బడ్జెట్ కేటాయింపులను అందుకుంది. సవరించిన అంచనాలో వాస్తవ వ్యయాన్ని తగ్గించింది. ఈ పథకాన్ని అమలు చేయడానికి రూ.33,000 కోట్లు వెచ్చించింది. తాజా బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రభుత్వం రూ.37,500 కోట్లు కేటాయించింది. దీనికి ప్రధానమంత్రి పోషణ్ మాదిరిగానే 60:40 నిష్పత్తిలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు నిధులు సమకూరుస్తాయి.

మధ్యాహ్నం భోజనం (పిఎం పోషణ)కి 2023-24లో రూ.11,600 కోట్లు కేటాయించగా, పథకం నిర్వహణకు రూ.10,000 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది పిఎం పోషన్‌కు రూ.12,467 కోట్ల బడ్జెట్ కేటాయించింది. పిఎం శ్రీ విషయానికొస్తే, రూ. 4,000 కోట్లు కేటాయించారు. అందులో రూ. 2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

2022 సెప్టెంబరులో పిఎం శ్రీ స్కూల్స్ (పిఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద, రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో దాదాపు 14,500 పాఠశాలలు జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి), 2020 ముఖ్య లక్షణాలను ప్రతిబింబించేలా కేంద్ర ప్రభుత్వంచే పునఃఅభివృద్ధి చేయబడుతుంది.

యుజిసికి తగ్గిన కేటాయింపులు

దేశంలో ఉన్నత విద్య అపెక్స్ రెగ్యులేటరీ బాడీ అయిన యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) కోసం ప్రభుత్వ కేటాయింపులు కూడా 2023-24లో రూ.5,360 కోట్ల నుండి 2024-25లో రూ. 2,500 కోట్లకు బాగా తగ్గాయి.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ దారుణం

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయివేటుపరం చేయడం దారుణమని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒవి.రావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1039వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఒవి.రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలన్ని ఆనాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి పరిశ్రమలను నేటి ప్రధాని మోడీ కారుచౌకగా పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బిజెపి కుట్రలు కార్మికుల ఐక్యత ముందు సాగవన్నారు. దీక్షల్లో యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, ఎన్.కృష్ణ, యు.సోమేశ్, ఆర్ఎన్.ఆంజనేయులు, బి.ఆనంద్, ఆదిరెడ్డి శ్రీను, జి.సత్యనారాయణ, బి.సింహాచలం, అప్పలరాజు పాల్గొన్నారు.

వాగ్దానాలు కాదు.. నిధులు, ఉత్తర్వులు ఇవ్వండి

- మోడీకి ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ఈ నెల 2న 'భారత్ మొబిలిటీ సమ్మిట్'ను ప్రారంభిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) స్వాగతించింది. అయితే కేవలం వాగ్దానాలు మాత్రమే కాదని, నిధులు, ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2న మోడీ మాట్లాడుతూ 'జాతీయ రహదారుల వెంబడి ట్రక్కులు, ట్యాక్సీ డ్రైవర్ల కోసం అన్ని సౌకర్యాలతో వెయ్యి భవనాలను మా ప్రభుత్వం నిర్మించనుంది' అని తెలిపారు. డ్రైవర్ల కోసం జాతీయ రహదారుల వెంబడి అన్ని సౌకర్యాలతో భవనాలు నిర్మించాలని తాము సుదీర్ఘకాలం నుంచి డిమాండ్ చేస్తున్నట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన పదేళ్ల తరువాతయినా ప్రధానమంత్రి మోడీ ఈ డిమాండ్‌ను గుర్తించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాల కోసం ప్రస్తుత బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలని, ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ పర్మిట్ వాహనాల్లో ఇద్దరు డ్రైవర్లను నియమించడం అనే నిబంధనను తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ నిబంధనను సడలించిందని, ఒక డ్రైవర్‌తో పనిచేయడానికి అనుమతించిందని తెలిపారు. ఇది డ్రైవర్లపై అపరిమిత పని గంటలను సృష్టించిందని, డ్రైవర్లపై ఒత్తిడి పెంచిందని విమర్శించారు. ఈ సడలింపుతో జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువయ్యాయని తెలిపారు. కాబట్టి నేషనల్ పర్మిట్‌పై ఇద్దరు డ్రైవర్లు నిబంధనను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల నిర్మాణాల్లో లెక్కలేనన్ని ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఇది ప్రమాదాలకు కారణమవుతోందని గుర్తు చేసింది. ఇలాంటి లోపాలను సరిదిద్దాలని, నిబంధనలను ఉల్లంఘిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టు చేయాలని ఎన్నిసార్లు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించింది. ఇలాంటి వైఫల్యాలను పక్కపెట్టి డ్రైవర్లను శిక్షించడం తగదని తెలిపింది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే భారతీయ న్యాయ సంహిత 106 (1) (2)కు సవరణ చేసి, డ్రైవర్లకు శిక్షలను పెంచే నిబంధనను ఉపసంహరించుకోవాలని ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ముగ్గురు మయన్మార్ వాసుల అరెస్టు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా కేసులో మయన్మార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. ఈ మేరకు వారిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులు మయన్మార్‌లోని మౌంగ్‌డా జిల్లా నివాసితులైన రబీయుల్ ఇస్లాం, సోఫి, అలోమ్, మహ్మద్ ఉస్మాన్‌గా గుర్తించింది. ఎన్ఐఎ తెలిపిన వివరాల మేరకు.. ఈ ముఠా సరైన పత్రాలు లేకుండా దేశంలోకి అక్రమంగా ప్రవేశించింది. వీరు ఎక్కువగా బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న రోహింగ్యా యువతులను, విదేశీయులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. తమ జాతి పురుషులతో వివాహం జరిపిస్తామని నమ్మించి, అనంతరం ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జమ్ముకాశ్మీర్, హర్యానా, తెలంగాణ రాష్ట్రాల్లో బలవంతపు వివాహాలకు విక్రయిస్తున్నారు. వారు వాడుతున్నవి నకిలీ ఆధార్ కార్డులని, వాటిని ఉపయోగించి వివిధ సిమ్ కార్డులు కొనుగోలు చేయడానికి, బ్యాంకు ఖాతాలు తెరవడానికి ఉపయోగిస్తున్నట్లు తేలింది. 2023 నవంబరు 7న కేసు విచారణను ఎన్ఐఎ ప్రారంభించింది.

నేడు బలపరీక్ష

- రాంచీకి చేరుకున్న జెఎంఎం ఎమ్మెల్యేలు

రాంచీ: జార్ఖండ్‌లో కొత్తగా కొలువుతీరిన చంపయి సోరేన్ ప్రభుత్వం సోమవారం బలపరీక్షకు సిద్ధపడింది. నేడు అసెంబ్లీలో బలపరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో శిబిరంలో ఉన్న జెఎంఎం ఎమ్మెల్యేలు ఆదివారం రాత్రికి రాంచీకి తిరిగివచ్చారు. జనవరి 31న హేమంత్ సోరేన్‌ను ఇడి అరెస్టు చేయడంతో అధికార కూటమి ఎమ్మెల్యేలు కొత్త ముఖ్యమంత్రిగా చంపయిని ఎన్నుకున్నారు. ఈ నెల 2న ఆయన ప్రమాణస్వీకారం చేశారు. 81 ఎమ్మెల్యేలు ఉన్న అసెంబ్లీలో మెజార్టీ మార్కు 41. అధికార కూటమిలోని జెఎంఎంకు 28 మంది ఎమ్మెల్యేలు , కాంగ్రెస్‌కు 16, ఆర్‌జెడి, సిపిఎం (ఎంఎల్)కు చెరో ఒక్కరూ ఉన్నారు.

ఎదురులేని హైదరాబాద్

- మిజోరంపై ఇన్నింగ్స్ 73 పరుగుల విజయం

హైదరాబాద్ : రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ అజేయంగా నిలిచింది. గ్రూప్ దశలో వరుసగా ఐదో మ్యాచ్‌లో విజయం సాధించింది. స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (5/74) ఐదు వికెట్ల మాయజాలంతో మిజోరం రెండో ఇన్నింగ్స్‌లో 43.1 ఓవర్లలో 193 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో సైతం ఆ జట్టు 199 పరుగులకే చేతులెత్తేసింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 465/9 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లోటు సైతం అధిగమించలేని మిజోరం ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. హైదరాబాద్ ఆటగాడు రోహిత్ రాయుడు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

కర్ణాటక మెరుపు విజయం

- రైల్వేస్‌తో రంజీ మ్యాచ్

సూరత్ : 226 పరుగుల ఊరించే ఛేదనలో కర్ణాటక ఉద్విగ్న విజయం సాధించింది. 99 పరుగులకే ఆరు వికెట్లు పడగొట్టిన రైల్వేస్ మ్యాచ్‌పై పట్టు బిగించగా.. కర్ణాటక బ్యాటర్ మనీశ్ పాండే (67 నాటౌట్, 121 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. టెయిలెండర్ విజయ్‌కుమార్ వైశాక్ (38) తోడుగా విలువైన భాగస్వామ్యం నమోదు చేసిన మనీశ్ పాండే.. రంజీ ట్రోఫీ చరిత్రలో కర్ణాటకకు ఛేదనలో అత్యుత్తమ విజయాన్ని అందించాడు. 82.4 ఓవర్లలో 9 వికెట్లకు 229 పరుగులు చేసిన కర్ణాటక.. రైల్వేస్‌పై గెలుపొందింది. కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులే చేయగా.. రైల్వేస్ వరుసగా 155, 244 పరుగులు చేసింది.

సమ్మె కాలపు హామీలపై
జిఓలు విడుదల చేయాలని రేపు ధర్నాలు

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించి నెలరోజులు కావస్తున్నా.. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జిఓలను ఇప్పటి వరకూ విడుదల చేయకపోవడం తగదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె నాగభూషణ, కె ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. తక్షణం సమ్మెకాలంలో ప్రభుత్వం మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందం మేరకు ఉత్తర్వులు విడుదల చేయాలని ఈ నెల 6న అన్ని జిల్లా కేంద్రాల్లో ఫెడరేషన్ చేపట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సమ్మె విరమణ సందర్భంగా రెండు, మూడు రోజుల్లో జిఓలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి విస్మరించడం తగదని అన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు చేపట్టిన ధర్నాల్లో అన్ని విభాగాల్లో పనిచేసే మున్సిపల్ వర్కర్లు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

షర్మిలపై దుష్ప్రచారం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా వైఎస్ షర్మిలపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వ్యక్తిత్వహననానికి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్ షర్మిలను ఉచ్చరించడానికి సాధ్యం కాని పదాలతో వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. సొంత చెల్లెలుపై పైశాచికంగా సోషల్ మీడియాలో సొంత పార్టీ కార్యకర్తలు దాడి చేస్తున్నా సిఎం జగన్ స్పందించకపోవడం తగదని అన్నారు. షర్మిలపై దాడిని నిలువరించాలని కోరారు.

పులి సంచారంతో స్థానికుల్లో ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

గత పది రోజులుగా పులి సంచారం పశ్చిమగోదావరి జిల్లా వాసులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. శనివారం అర్ధరాత్రి పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలంలో సరిహద్దు ప్రాంతమైన కొవ్వాడ గ్రామ శివారులో పులి సంచరించింది. కట్టేసి ఉన్న ఆవును చంపి సగం తిని వెళ్లిపోయింది. ఈ ఘటనతో ఏజెన్సీ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దెందులూరు మండలాల్లోని అటవీ ప్రాంతాల్లోని పంట పొలాల్లో పులి సంచరిస్తోందని స్థానికులు చెబుతున్నారు. జనవరి 24వ తేదీ రాత్రి బుట్టాయగూడెం మండల సరిహద్దు కొండారెడ్డి వద్దనున్న కోపల్లి అటవీ ప్రాంతంలో సంచరించి ఒక ఎద్దును చంపి కొంత భాగం తిని వెళ్లిపోయిదని తెలిపారు. మళ్లీ ఆదివారం తెల్లవారుజామున ఆవును చంపి తిని వెళ్లిపోయిందని వాపోయారు. కట్టేసిన పశువులపై దాడి చేసి వాటిని చంపేస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పులి సంచారంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి వారు భయపడుతున్నారు. పులిని పట్టుకొని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆయ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అటవీ శాఖ అధికారులు ఏజెన్సీలోని అటవీ ప్రాంతంను పరిశీలించి ట్రాప్ కెమెరాలను అమర్చారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఉత్తుత్తి పెళ్లిళ్లు

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులిస్తామంటూ వరుడుగా కూర్చోబెట్టారని చెప్పాడు. తనలాగే చాలామందిని అలాగే కూర్చోబెట్టారని తెలిపాడు.

మరో యువకుడు బబ్లూ మాట్లాడుతూ రూ.2000 నుంచి రూ.3000 ఇస్తామని, పెళ్లి వేడుకలో కూర్చోబెట్టారని చెప్పాడు. తనకు డబ్బులు ఇవ్వలేదని, వధువు ఎక్కడికి వెళ్లిందో తెలీదని అన్నాడు.

ఈ విషయమై బిజెపి ఎమ్మెల్యే కేత్కీసింగ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రెండు రోజుల ముందే తనకు సమాచారం అందిందన్నారు. కొందరు మోసానికి పాల్పడి ఉంటారని తాను అనుమానించానని, పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని ఆమె తెలిపారు. ఈ అంశంపై దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని అధికారులు చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దీపక్ శ్రీవాస్తవ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో పెళ్లయిన వారు మళ్లీ పెళ్లి చేసుకున్నట్లు తేలింది. సామూహిక వివాహాలు జరిగిన జంటల్లో కనీసం 190 జంటలు వివాహానికి అనర్హమైనవని తేలినట్లు యుపి టాక్ నివేదిక పేర్కొంది.

విచిత్రాలెన్నో...

వరుడు లేకుండా వధువులే ఉండటం కూడా వీడియోలో కనిపిస్తోంది. వరుడు, వధువు ఎదురెదురుగా కూర్చోవాల్సి ఉంది. కాగా, వధువు ఒక్కరే కూర్చోవడం, వారంత వారే మెడలో మాల వేసుకోవడం కనిపించింది.

సాధారణంగా పెళ్లిళ్లలో అమ్మాయిలకు ముసుగులు వేస్తారు. కానీ, ఈ పెళ్లిళ్లలో పెళ్లి కొడుకులు తమ ముఖాలు కనిపించకుండా పూర్తిస్థాయిలో ముసుగులు వేసుకోవడం చూడొచ్చు.

తహశీల్దార్ రమణయ్య హత్యకు
ఆ పది ఫ్లాట్ల వివాదమే కారణమా?

- 'రియల్టర్'పై అనుమానాలు
- విచారణ చేయాలని ఆర్‌డిఒకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

తహశీల్దార్ హత్యతో చర్చనీయాంశమవుతున్న జ్యూయెల్ అపార్టుమెంట్

విశాఖ నగరం కొమ్మాది సమీపాన ఓ అపార్టుమెంట్ వద్ద శుక్రవారం రాత్రి తహశీల్దార్ రమణయ్య హత్యకు మధురవాడ రుషికొండ ఐటి హిల్స్ సర్వే నెంబరు 380 పరిసర ప్రాంతంలోగల జ్యూయెల్ అపార్టుమెంట్‌లో రూ.కోట్ల విలువైన పది ఫ్లాట్ల రెగ్యులరైజేషన్ వివాదమే కారణమని ప్రచారం జరుగుతోంది. ఈ హత్యోదంతంపై విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డిని విచారణకు ఆదేశించారు. విశాఖ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఎన్ని ఫైళ్లు, ఏ రకమైన కేటగిరీలకు చెందినవి పెండింగ్‌లో ఉన్నాయో తెలపాలని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు. 2019లో జగన్ సర్కారు రాకముందు టిడిపి కాలంలో 338 జిఒను రెగ్యులరైజేషన్ కోసం తెచ్చారు. ఈ క్రమంలో జ్యూయెల్ అపార్టుమెంట్‌లోని వంద ఫ్లాట్లకుగానూ 90 ఫ్లాట్లు క్రమబద్ధీకరణ అయ్యాయి. అయితే, ఈ ఫ్లాట్లలో ప్రభుత్వ గెడ్డపోరంబోకు భూమి కొంత ఉన్నట్లు, రియల్ ఎస్టేట్ యజమాని అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులను వివిధ మార్గాల్లో సంతృప్తిపర్చి వ్యవహారాన్ని చక్కబెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన పది ఫ్లాట్లకు సంబంధించిన స్థలం 22 (ఎ)లో ఉన్నట్లు సమాచారం. ఇటువంటి స్థలాలను సక్రమమైన డాక్యుమెంట్లు చూపి క్రమబద్ధీకరణ చేసుకోవాలి. ప్రభుత్వ విలువ చెల్లించాలి. ఈ ప్రాంతంలో గజం స్థలం రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకూ ధర పలుకుతోంది. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక 22 (ఎ) నుంచి తొలగించడానికి తహశీల్దారు రమణయ్యను సదరు రియల్టర్ సంప్రదించినట్టు తెలుస్తోంది. అప్పటికే రియల్టర్ ఆ పది ఫ్లాట్లను కొందరు ఎన్‌ఆర్‌ఐలకు విక్రయించి వారి నుంచి కోట్ల రూపాయలు తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఈ ఫ్లాట్లపై అంగీకరించి గడిచిన రెండేళ్లుగా తహశీల్దార్ రమణయ్య రివర్స్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఎక్కువ పనులను తన మీద వేసుకుని అవతల వారికి హామీ ఇచ్చి ఆయన ఇబ్బంది పడేవారని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ పది ఫ్లాట్ల క్రమబద్ధీకరణ వ్యవహారంలో కాలయాపన జరగడం, సదరు రియల్టర్ పలుమార్లు తిరగడం, ఈ ఫ్లాట్లను కొనుగోలు చేసిన వారు రియల్టర్‌పై ఒత్తిడి పెంచడం తదితర కారణాల నేపథ్యంలో రమణయ్య హత్య జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. రియల్టర్‌పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయనపై హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు సమాచారం. విజయవాడ నుంచి విశాఖకు మకాం మార్చిన సదరు రియల్టర్ రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు కూడా చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఇటీవల కాలంలో విశాఖ జిల్లాలో 70కి పైగా భూ వివాదాల్లో రూ.వందల కోట్లు చేతులు మారిన వైనం తెలిసిందే. భూ వివాదాల నేపథ్యంలో బెదిరింపులు, దాడులు, వ్యక్తుల హత్యకు పథకాలు వంటివి నానాటికీ పెరుగుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహశీల్దార్ రమణయ్య హత్యపై భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డిని 'ప్రజాశక్తి' సంప్రదించగా, పోలీసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

టిడిపికి అభ్యర్థులు దొరకడం లేదు

- మంత్రి అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో టిడిపికి అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని మామిడి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి రాము అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. వైసిపి నాయకులు కొత్త చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. తాము ఎన్నికలకు 'సిద్ధం' అని ప్రకటిస్తే.. చంద్రబాబు 'రా కదలి రా' అని అభ్యర్థులను వెతుక్కునే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఇతర ప్యాకేజీలు మాట్లాడుకునే పనిలో ఉన్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో రైతులను, డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో మోసం చేశారని విమర్శించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, టిడిపి, జనసేన, బిజెపి కలిసి వచ్చినా తమకు ఎటువంటి ఢోకా లేదని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు షర్మిల వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీపై స్పందిస్తూ.. సీట్ల కోసం భేటీ అయ్యారో.. నోట్ల కోసం భేటీ అయ్యారో వారే సమాధానం చెప్పాలన్నారు. రాజకీయాల్లో సీట్లు రాని వారు పార్టీలు మారడం సహజమని పేర్కొన్నారు. మంత్రి విడదల రజనీ మాట్లాడుతూ.. వైసిపిలో కష్టపడే నాయకులకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. సభలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటిమనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి తదితరులు ప్రసంగించారు.

వైసిపికి మాజీ ఎమ్మెల్యే మక్కెన గుడ్‌బై

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసిపికి రాజీనామా చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఆయన ఈసారి వినుకొండ సీటు తనకు వస్తుందని ఆశించారు. టికెట్ రాకపోవడంతో పార్టీని వీడారు. 2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు 2009లో ఆ పార్టీ టికెట్ ఇవ్వలేదు. దీంతో 2012లో ఆయన వైసిపిలో చేరారు. 2014, 2019లో వైసిపి నుంచి పోటీ చేసే అవకాశం రాలేదు. ఈసారి కూడా అవకాశం లేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో వినుకొండలోని తన అనుచరులతో ఆయన సమావేశమై వైసిపికి రాజీనామా చేస్తున్న విషయాన్ని ప్రకటించారు. నర్సరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయులు ఇటీవల వైసిపి నుంచి తప్పుకోవడంతో ఆయన అనుచరుడుగా ఉన్న మక్కెన కూడా పార్టీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. కృష్ణదేవరాయులు త్వరలో టిడిపిలో చేరడానికి రంగం సిద్ధం చేసుకోవడంతో ఆయనతో కలిసి మక్కెన కూడా టిడిపిలోకి వెళ్లడానికి వెళ్లనున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఫెయిల్యూర్ సిఎంగా జగన్

- టిడిఎల్‌పిలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను వంచిస్తున్న జగన్‌కు ప్రజాకోర్టులో శిక్ష పడటం ఖాయమని, అతిపెద్ద ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికల ముందు ఊరూరా తిరిగి అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. ఉండవల్లిలోని తన నివాసంలో టిడిపి శాసనసభా పక్ష సమావేశం ఆదివారం జరిగింది. టిడిఎల్‌పి ప్రచురించిన 'ప్రజాకోర్టు-జగన్ నెరవేర్చని హామీలు' ఛార్జ్‌షీట్‌ను చంద్రబాబు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టో, పాదయాత్రలో మొత్తం 730 హామీల్లో 21 శాతం అమలు చేయకుండా 99 శాతం అమలు చేశానంటూ ప్రజల్ని వంచిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోనని హామీ ఇచ్చి, రూ.64 వేలకోట్ల భారం మోపారని అన్నారు. మద్య నిషేధం హామీని అటకెక్కించి మద్యం అమ్మకాలతో భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని తాకట్టుపెట్టి రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చారని తప్పుబట్టారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీ గాలికొదిలేశారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, పన్నులు, ఛార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలపై మాట తప్పి జనం జేబులు కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో సిపిఎస్ రద్దు హామీపై మాట తప్పారన్నారు. మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తానన్న హామీపై మాటే మాట్లాడడం లేదని విమర్శించారు. జలయజ్ఞం అంటూ ఆర్భాటంగా ప్రకటించి, ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ప్రతియేటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. సొంత జిల్లాలో ఏర్పాటు చేస్తానన్న స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై నాలుక మడతేశారని విమర్శించారు. పోలీసులకు వీక్లీ ఆఫ్ హామీ గాలికొదిలేశారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రానున్న ఎన్నికల్లో ఒపిఎస్ సాధనే ఎజెండా

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కాకినాడ

రాబోయే ఎన్నికల్లో ఒపిఎస్ సాధనే ఎజెండా కావాలని, అందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కాకినాడలోని యుటిఎఫ్ హోంలో ఆదివారం ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో పాత పెన్షన్ పునరుద్ధరణ రాజకీయ ఎజెండా కావాలని ఆకాంక్షిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తామని గత ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. జిపిఎస్ వల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఒపిఎస్ సాధనే ఎజెండా చేయాలని అన్ని రాజకీయ పక్షాల నాయకులను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కలుస్తామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ సంఘటిత పరచి ఒపిఎస్ సాధనే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాం, జిల్లా అధ్యక్షుడు కెవివి నగేష్, ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా కార్యదర్శి టి.సీతారామయ్య, కుటుంబ సంక్షేమ పథకం కార్యదర్శి ఎన్.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు ఐవి, లక్ష్మణరావు

గ్రూప్స్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదవాలి

- అవగాహన సదస్సులో ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఐవి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రూప్స్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ అవ్వాలని ఎమ్మెల్సీ, పోటీ పరీక్షల నిపుణులు కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వీరేశలింగం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్స్, డివైఇఒ పోటీ పరీక్షల అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ అభ్యర్థులు సిలబస్‌పై పట్టు కలిగి ఉండాలని, ప్రీవియస్ పేపర్లు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రశ్నలను బాగా అవగాహన చేసుకున్న తర్వాతే సమాధానం రాయాలని తెలిపారు. భారత సమాజం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే రెండు సబ్జెక్టుల నుంచి 60 మార్కులకు పేపర్ ఉంటుందని ఇవి అన్నీ స్పెషలైజేషన్ సబ్జెక్టుల వారికి కీలకమైనవన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా గ్రూప్స్, డిఎస్‌సి ఇతర పోటీ పరీక్షలు నిర్వహించకుండా, రాష్ట్రంలో సుమారు 2.50 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్‌లోనూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అరకొర పోస్టులు ఇచ్చారని విమర్శించారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ అరుణకుమారి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మానవతావాది డాక్టర్ జ్యోతి

- సంస్మరణ సభలో సిపిఎం సీనియర్ నాయకులు మధు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

డాక్టర్ జ్యోతి సంస్మరణ సభలో మాట్లాడుతున్న మధు

ప్రజల పట్ల గౌరవ భావంతో, తల్లిదండ్రుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప మానవతావాది డాక్టర్ జ్యోతి అని మాజీ ఎంపి, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు కొనియాడారు. మానవతావాదాన్ని అలవరుచుకోవడమే జ్యోతికి ఇచ్చే నివాళి అన్నారు. వృత్తిలోనూ ప్రవృత్తిలోనూ మానవత్వం మూర్తీభవించిన డాక్టర్ సిరివరపు జ్యోతి సంస్మరణ సభ కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో ఆదివారం జరిగింది. సమత నర్సింగ్ హోం వైద్యులు చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన సభలో మధు మాట్లాడుతూ.. జ్యోతి తల్లిదండ్రులు నాగెళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్యల పేరుతో ఉయ్యూరులో ట్రస్టు నిర్మించారని, దాని నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు. జ్యోతి ఆశయాలను నెరవేర్చేందుకు సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంబివికె ట్రస్టు బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావాలున్న జ్యోతి అన్ని మతాలవారికి సాయం చేశారని తెలిపారు. ఆమె సెక్యులర్ దృక్పథం కలిగి ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రుల బాటలోనే జ్యోతి ప్రజలకు అసాధారణ సేవలందించారని కొనియాడారు. రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి వై.కేశవరావు మాట్లాడుతూ ప్రజాసేవలో ముందున్న రాజేశ్వరమ్మ, జానకిరామయ్య లక్షణాలను జ్యోతి పుణికిపుచ్చుకున్నారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు జ్యోతి కృషి చేశారన్నారు. తొలుత నేతలు జ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, వైద్యులు నీరజ, పూర్ణచంద్రరావు, అమన్, సుధాకర్, వెంకట్, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు నిమ్మాది గోపాల్, ఎస్‌కె ఇస్మాయిల్, విశ్వశాంతి విద్యా సంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సిపిఎం, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కథాగాన కళలు తెలుగు భాషకు నిధులు

- కళారత్న షేక్ బాబూజీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాట్లాడుతున్న షేక్ బాబూజీ

తెలుగు భాషకు కథగాన కళలు నిధులని, వీటి నుండే శాస్త్రీయ కళలు పుట్టుకొచ్చాయని బుర్రకథ అధ్యాపకులు, కళారత్న షేక్ బాబూజీ అన్నారు. ప్రజల అవసరాలు తీరిస్తేనే ఏ కళకైనా మనుగడ ఉంటుందని తెలిపారు. బుర్రకథ పితామహులు పద్మశ్రీ షేక్ నాజర్ 124 జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ట్రైనీటాట్స్ కిండర్ జాయ్ పాఠశాలలో పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యాన బుర్రకథపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నాజర్ కుమారుడు, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బుర్రకథ కళా అధ్యాపకులు షేక్ బాబూజీ మాట్లాడుతూ సర్వ కళల సమాహారమే బుర్రకథని అన్నారు. శాస్త్రీయ కళల్లో ఆడేవారు, పాడేవారు, నటించేవారు వేర్వేరుగా ఉంటారని, కథాగాన కళలైన బుర్రకథ, బొమ్మలాట, ఒగ్గుకథ, జముకుల కథ, పంబకథ తదితరాల్లో ఒక్కరే ఆడటం, పాడటం, మాట్లాడటం, నటించడం చేస్తారని వివరించారు. బుర్రకథను అనేక భాషల్లో అనువదించి ఆయా భాష సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని, ఇటువంటి కార్యక్రమాల నిర్వహణను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎస్ఆర్.కె ప్రసాద్, పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులు కోయ రామారావు, మేడా సాంబశివరావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, టి.అంజిరెడ్డి మాస్టారు, టి.యోహాన్ రాజు, స్వర్ణ రామిరెడ్డి, కె.శివపార్వతి, బి.సలీం, ట్రైనిటాట్స్ డైరెక్టర్ పాతూరి కోటేశ్వరమ్మ, చిన ఓబయ్య, ఏసుదయ తదితరులు బుర్రకథ కళారూపాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరాన్ని వివరిస్తూ ప్రసంగించారు. తొలుత నాజర్ చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

గిరిజన హక్కులకు ముప్పు

- ఆదివాసీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ బాబూరావునాయుడు

ప్రజాశక్తి - మెళియాపుట్టి (శ్రీకాకుళం)

మాట్లాడుతున్న బాబూరావు నాయుడు

గిరిజన హక్కులకు ముప్పు పొంచి ఉందని ఆదివాసీ జెఎసి రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఎఎస్ అధికారి టి.బాబూరావునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు ఐక్యంగా పోరాడడం ద్వారానే హక్కులు కాపాడుకోగలరని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో ఆదివాసీ సేన ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై గిరిజనులకు అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, వి.కృష్ణారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఆదివాసీలను దగా చేస్తూ గిరిజనేతరులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని తప్పుడు వాగ్దానాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలు లేరని తెలిపారు. బెంతు ఒరియాల పేరుతో బిసి-ఎకి చెందిన వడ్డి కులస్తులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రెండు వేల నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు పొంది పలు ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ న్యాయవాది ఊకే రవి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న కులగణనలో బెంతు ఒరియాగా నమోదు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, బోయ/ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, మత్స్యకారులు, మేదర ఇతర గిరిజనేతరులను ఆదివాసీల తెగలో చేర్చొద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్‌పిటిసి గూడ ఎండయ్య, పడాల భూదేవి, ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర సహాధ్యక్షులు వాబ యోగి, గిరిజన సంఘాల నాయకులు సవర చొక్కారావు, సవర కుమార్, పెద్దింటి చంద్రరావు, తెంబూరు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో యాత్రికుల రద్దీ

- శ్రీవారి దర్శనానికి పది గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో యాత్రికుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే శ్రీవారిని 54 వేల మంది దర్శించుకున్నారు. 24 కంపార్టుమెంట్లు యాత్రికులతో నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి పది గంటలు సమయం పడుతోందని టిటిడి అధికారులు తెలిపారు. గడిచిన మూడు రోజులుగా యాత్రికులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తిరుమల కొండ రద్దీగా మారింది. మరో రెండు రోజులు రద్దీ కొనసాగే అవకాశముందని టిటిడి అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికులు చెల్లించుకున్న మొక్కుల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.15 కోట్ల ఆదాయం సమకూరిందని టిటిడి అధికారులు తెలిపారు.

MOTILAL OSWAL
HOME LOANS

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ నంబర్ : U65923MH2013PLC248741
కార్పొరేట్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్డు, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. **ఇ మెయిల్ : hfquery@motilaloswal.com**
శాఖా కార్యాలయం : 2వ అంతస్తు, 59-13-2/1, గాయత్రి నగర్, ఘంటసాలవారి వీధి, పాలీటెక్నిక్ పోస్ట్, విజయవాడ-520008, ఆంధ్రప్రదేశ్.
శాఖా కార్యాలయం : అరండల్‌పేట, 15/3, 1వ అంతస్తు, ఆధార్ కార్డ్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్, గుంటూరు-522002, ఆంధ్రప్రదేశ్.
సంప్రదించాల్సిన నం.: ఎపి- బొప్పూరి నాగరాజు 7304997399 మరియు పివిఆర్ సుబ్రమణ్యం-9372705039.

ఇ-వేలం కం విక్రయం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 నియమాలతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తు (ల) అమ్మకం కొరకు 30 రోజుల ఇ-వేలం విక్రయ ప్రకటన.
సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తులు ఏవైతే, మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **మోతీలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)/ సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయిని రియలైజేషన్ తేదీ వరకు ఇందు దిగువ పేర్కొన్న బకాయిలు మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలను రికవరీచేయుట కొరకు, ఇందు దిగువ పేర్కొన్న తేదీ మరియు సమయంన **"ఎక్కడ ఉందో అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏమైనా ఉంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రిజర్వు ధర, ధరావత్తు (ఇఎండి) మరియు ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది ఇందు దిగువ కూడా పేర్కొనబడినవి:

రుణగ్రహీత(లు)/హామీదారు(లు) /లోన్ ఎకౌంట్	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి వివరణ	రిజర్వు ధర, ఇఎమ్‌డి మరియు ఇఎమ్‌డి సమర్పణకు చివరి తేది	ఇ-వేలం తేది మరియు సమయం
ఎల్ఎఎన్ : LXVIJ00417-180051177 శాఖ : విజయవాడ రుణగ్రహీత : బాపనపల్లి సుబ్బారావు, సహ రుణగ్రహీత : బాపనపల్లి వాణి	24-08-2021 కొరకు రూ.16,47,835/- (పదిహేను లక్షల ఎనిమిది వేల ఆరు వందల ఐదు రూపాయలు మాత్రమే)	ఆర్.ఎస్.నం.235, వార్డు నం.-5, డో.నం.5-378/బి, మంగళగిరి, రామాలయం గుడి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503.	రిజర్వు ధర: రూ.19,00,000/- (పంతొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి : రూ.1,90,000/- (ఒక లక్షా తొంభై వేల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేది : 05-03-2024	06-03-2024, సమయం: ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. (ప్రతిసారి 5 నిమిషముల అపరిమిత పొడిగింపులతో)
ఎల్ఎఎన్ : LXGUN04119 - 200075801 శాఖ : గుంటూరు రుణగ్రహీత : పోరుమాళ్ల శివ నాగేశ్వరరావు, సహ రుణగ్రహీత : పోరుమళ్ల నాగరాధిక	08-06-2023 కొరకు రూ.5,96,941/- (ఐదు లక్షల తొంభై ఆరు వేల తొమ్మిది వందల నలభై ఒక్క రూపాయలు మాత్రమే)	సర్వే నం.34/2, మూల్యాంకనం నం.57-143/4, గోరంట్ల, రామాలయం గుడి వద్ద, గుంటూరు మూల్యాంకనం నం.135176, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034.	రిజర్వు ధర: రూ.7,00,000/- (ఏడు లక్షల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి : రూ.70,000/- (డెభై వేల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేది : 05-03-2024	06-03-2024, సమయం: ఉ .11.00 గం. నుండి సా.5.00 గం. (ప్రతిసారి 5 నిమిషముల అపరిమిత పొడిగింపులతో)

ఇ-వేలం షరతులు మరియు నియమాలు :
1. వేలం బిడ్ పత్రం యొక్క తదుపరి నియమాలు మరియు షరతుల ప్రకారం మరియు దానిలో ప్రవేశపెట్టిన విధానం ప్రకారం నిర్వహించబడుతుంది. బిడ్డరుదారులు మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఆస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ గా పేర్కొనబడింది) వెబ్‌సైట్ :www.motilaloswalhfl.com ద్వారా వెళ్లవచ్చు. మా సేల్స్ అండ్ మార్కెటింగ్ వెబ్‌సైట్ మరియు ఇ- వేలం సర్వీస్ ప్రొవైడర్, **https://auctions.inventon.in** సంప్రదించవచ్చు. బిడ్ డాక్యుమెంట్ల కొరకు, ఇ-వేలం కొరకు ఉంచబడిన సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు మరియు బిడ్ ఫారం ఆన్‌లైన్‌లో సమర్పించబడతాయి.

సం/-
అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)
ప్రదేశం: విజయవాడ
తేది: 05.02.2024 *అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.

అక్షరం
ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 విజయవాడ
సోమవారం 5 ఫిబ్రవరి 2024



ఎవడు ఇక్కడ రైతు
ఎవడు ఇక్కడ రాజు
కష్టించు వారొకరు
కాజేయువారొకరు
– పొట్లపల్లి రామారావు

ఆలోచింపజేసిన సుమధుర హాస్య నాటికలు

నాటికోత్సవంలో ఓ ప్రదర్శన

ఈనెల 1వ తేదీన ప్రారంభమై 4వ తేదీ వరకూ జరిగిన సుమధుర 26వ హాస్య నాటికల పోటీలు ప్రేక్షకులను అలరించాయి. సిద్ధార్థ కళాపీఠం వారి సౌజన్యంతో కళాశాల ఆడిటోరియంలో 50వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమాలకు ప్రారంభోత్సవ సభ జరిగింది. సభాధ్యక్షులు, సుమధుర అధ్యక్షులు సామంతపూడి నరసరాజు మాట్లాడుతూ, 50 ఏళ్ల పైబడి విజయవాడలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక నాటక సంస్థ సుమధుర అని అన్నారు. ప్రతి సంవత్సరం పరిషత్‌తో పాటు ప్రతినెలా కార్యక్రమాలను నిర్వహించగలడానికి ప్రేక్షకాదరణే కారణం అని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షులు ఎం.సి.దాస్ మాట్లాడుతూ, పోటీ పరిషత్తులో యువ నటీనటులను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండు యువ నాటికలకు కూడా అవకాశం కల్పించామని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి తమ పరిషత్తులో పాల్గొనే యువతీ యువకులకు ప్రత్యేకంగా నగదు పారితోషికం ఇస్తున్నట్లు చెప్పారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ మురళీకష్ణ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో 20, 30 ఏళ్ల వాళ్లకూ గుండె జబ్బులు రావటానికి విపరీతమైన మానసిక ఒత్తిడే కారణమని, దీనికి ఏకైక విరుగుడు అందరితో కలిసి నవ్వుకోవడమేని అన్నారు. ఇంకా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య జి.అనిత, నట దర్శకులు పీవీఎన్.కష్ణ మాట్లాడారు. అమరావతి బాలోత్సవ్ జనరల్ సెక్రటరీ ఆర్.కొండలరావు బాలోత్సవ్‌కు లభిస్తున్న ఆదరణ నాటక రంగ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా గుడివాడ లహరికి రావి కొండలరావు – రాధాబాయి స్మారక అవార్డుని ఇచ్చి సత్కరించారు. సుమధురతో తన నాటక రంగయాత్ర ప్రారంభమై సుమధుర స్వర్ణోత్సవ వేడుకల సభలో సత్కారం పొందడం మరువలేనిది ఆమె అన్నారు.

కాగా, మొదటి రోజు పెద్దిబోయిన కష్ణ హితేష్ రచనా దర్శకత్వంలో కష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గుడివాడ వారు 'నాన్నా! నేనే గెలిచా!' హాస్యనాటికతో పరిషత్తు పోటీ ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. తన తండ్రిని తాను చూసుకున్న దానికంటే తన కొడుకు ఇంకా బాగా చూసుకుంటాడని తండ్రీ కొడుకులు పరస్పరం విసురుకున్న ఛాలెంజ్‌లో ఎవరు గెలిచారు? అన్న దానికి హాస్యాన్ని జతచేసి చెప్పే ప్రయత్నం చేసింది ఈ నాటిక. రెండవ నాటిక 'ట్రీట్మెంట్' గొల్లపూడి రాజ్యలక్ష్మి కథా రచనకు నాటక అనువాదం కీర్తిశేషులు డాక్టర్ పి.బ్రహ్మానందరావు. పల్లెలో పనీపాటా చేసుకుంటూ గడిపే వయోవృద్ధులను పట్నం తీసుకువచ్చి పూర్తి విశ్రాంతి కల్పిస్తే – సహజంగా ఆ వయసులో ఉండే రోగ భయంతో శారీరకంగా ఏ చిన్న అసౌకర్యం తోచినా అదేదో రోగానికి సంబంధించినదేనన్న అనుమానం, భయంతో బతుకుతారు. అలాంటి మనస్తత్వం గల ఒక పెద్దావిడకు ఆరోగ్యకరమైన ఆలోచనలతో శరీరానికి ఏదో ఒక వ్యాపకం కల్పించుకునేలా చేసి, ఆవిడ అనారోగ్యాన్ని పోగొట్టేలా ఒక డాక్టర్ ఇచ్చిన 'ట్రీట్మెంట్' ఈ హాస్య నాటిక.

సుమధుర, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్త నిర్వహణలో కళాకారుల నాటకరంగ అనుభవజ్ఞులతో గోష్టి రెండో రోజు ఉదయం జరిగింది. సాయంత్రం మొదటి నాటికగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారు మాడభూషి దివాకరబాబు రచన, రౌతు వాసుదేవరావు దర్శకత్వంలో 'రంగుపడుద్ది' ప్రదర్శించారు. భార్యను సంతోషపెడితే అది సప్తవర్ణాల ఇంద్రధనస్సు. భార్యని ఏడిపిస్తే, ఆమె ఆగ్రహావేశానికి గురైతే.. అదే సప్తవర్ణ ఇంద్రధనస్సు ఇంకో కోణంలో కనిపిస్తుంది. వ్యసనపరుడైన భర్తకి రంగుపడేలా చేసి బుద్ధి గరిపిన ఓ సగటు ఇల్లాలి కథే ఈ నాటిక ఇతివృత్తం.

మాతశ్రీ కళానికేతన్ విశాఖపట్నం వారు రావి నాగేశ్వరరావు రచించిన పివిఎన్ సత్యనారాయణ దర్శకత్వం వహించిన, 'చూపులు కలవని శుభవేళ' నాటికను ప్రదర్శించారు. పెళ్లిచూపుల్లో ఓ అమ్మాయి అబ్బాయి చూపులు కలవకుండానే జంటగా మారిపోవాలని నిర్ణయించుకుంటారు. నిజానికి వారిద్దరూ ముందే ప్రేమికులు. ఆ విషయం ముందుగా తెలియని తండ్రి, తెలుసుకున్న తర్వాత పెళ్లికి పచ్చజెండా ఊపుతాడు. రెండవ రోజు చివరి నాటిక 'ఏడనున్నాడో! ఎక్కడున్నాడో!' చిలకలూరిపేట ఎమెచ్యూర్స్ డ్రమాటిక్ అసోసియేషన్ రూపొందించిన ఈ నాటికకు దర్శకుడు ఎస్ కే షఫీ. స్వార్థపరుడైన ఒక మేనమామ స్థితిమంతురాలైన మేనకోడలి ఆస్తిని కాజేయటానికి చేసే ప్రయత్నాలను మరో మేనల్లుడు అడ్డుకొని, ఎలా బుద్ధి చెప్పాడో.. ఆ వైనమే ఈ హాస్య నాటిక.

మూడో రోజు శనివారం ఉదయం సుమధుర సంస్థ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా యువ కళాకారులతో ఇన్‌స్టంట్ డ్రామా కాంపిటీషన్స్ నిర్వహించారు. దీని ముఖ్య నిర్వాహకుడు నాగార్జున విశ్వవిద్యాలయ రంగస్థల ప్రదర్శన కళల శాఖలో ప్రధాన బాధ్యతలు వహిస్తున్న ఎల్.విభూషణ్. అప్పటికప్పుడు యువ కళాకారులే ఒక అంశాన్ని చర్చించుకుని మూడు బృందాలుగా విడిపోయి 10 నుంచి 20 నిమిషాల నిడివి గల మినీ నాటికలను ప్రదర్శించి చూపారు. ఎస్కే మిశ్రో, సుబ్బరాయ శర్మ, రమేష్ బాబు సూరపనేని, తులసి బాలకష్ణ, ఆకుల మల్లేశ్వరరావు ఆ ప్రదర్శనను చూసి వారిని అభినందిస్తూ మరికొన్ని రంగస్థల మెలకువలను బోధించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ ఒక్కపూట కార్యశాల ఆశావాహమైన ఆరంభానికి నాంది పలికింది. ఈ ప్రదర్శనలకు వివిధ ప్రేక్షక సమూహాల మధ్య అవకాశం కల్పిస్తామని, ఇకపై ఇలా కార్యశాలల నిర్వహణను కొనసాగిస్తామని సంస్థ అధ్యక్షులు నరసరాజు ప్రకటించారు.

కాగా, హాస్య నాటికల పోటీల ప్రారంభానికి ముందు తొలిరోజు న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్, పీవీ సిద్ధార్థ కళాశాల వారు సంయుక్తంగా ఎం.ఎస్ చౌదరి రచన దర్శకత్వంలో కపిరాజు నాటిక ప్రదర్శించారు. రావణ విభీషణుల మధ్య అహంకారం, వాలి సుగ్రీవుల మధ్య అధికార చిచ్చు, రామలక్ష్మణుల అన్యోన్య అనుబంధాలను వివరించిన విలక్షణ ప్రదర్శన ఇది. పోటీ నాటికల ప్రారంభానికి ముందుగా జరిగిన సభా కార్యక్రమంలో కీర్తిశేషులు శనగల కబీర్దాస్ స్మారక పురస్కారాన్ని సుమధుర సంస్థ వారు ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. డాక్టర్ కందిమళ్ళ తదితరులు విజయభాస్కర్ రచనా వైవిధ్యతను, ఆయన రంగస్థల సేవలను గుర్తు చేస్తూ మాట్లాడారు.

నాటికల పోటీలో మూడవరోజు మొదటి నాటిక 'పక్కింటి మొగుడు' పండు క్రియేషన్స్ కొప్పోలు వారు ప్రదర్శించారు. గోవిందరాజుల నాగేశ్వరరావు రచనకు బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. "ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకొని ఎదుటివారిని బ్లాక్ మెయిల్ చేయటం తప్పని, లాయర్ వత్తి నైతికతకు అది విరుద్ధమని, మిస్టేకెన్ ఐడెంటిటీలో హాస్యాన్ని మేళవించి రచించిన దాన్ని నటీనటులు ప్రదర్శించారు. అనంతరం యువభేరీ థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారు 'బూడిద' నాటిక ప్రదర్శించారు. అక్కల తామేశ్వరయ్య రచనకు వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు. ఒక భార్యాభర్తల జంట ఉన్నదానితో తప్తి పడక, అడ్డదారుల్లో సంపాదించి అందలం ఎక్కాలనుకునే మనస్తత్వంతో ఉంటారు. మామయ్య వరుసయ్యే వ్యక్తి, వారిని సరైన మార్గంలో పెట్టడానికి నడిపించిన అంతర్నాటకమే 'బూడిద'. చివరి నాటిక 'కలిసుంటే ...' రచన. దర్శకత్వం ఎస్.డేవిడ్ రాజు. చిన్న చిన్న కారణాలతో కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతున్నాయో తెలుపుతూ, అత్తా కోడళ్ళు, వారి భర్తల మధ్య జరిగిన కొన్ని సంఘటనలకు ఇచ్చిన హాస్యరూపం ఇది. ఈ పోటీ పరిషత్‌కు గుణ నిర్ణేతలుగా ఎస్కే మిశ్రో, ఉప్పలపాటి సుబ్బరాయ శర్మ, కోట శంకర్ వ్యవహరించారు.

నాల్గవ తేదీ ఉదయం యువజనోత్సవ సంబరాల్లో భాగంగా 'పాడుతా తీయగా' 'నాట్య తరంగాలు' 'వాయిద్య విన్యాసం' వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం సాయంత్రం ముందుగా శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విజయవాడ వారి యువ నాటిక 'ఇంకానా?' ప్రదర్శించారు. మరో ప్రదర్శన నాటిక 'న్యూ బాంబే టైలర్స్' స్టూడియో హైదరాబాద్ వారు, మహమ్మద్ ఖదీర్‌బాబు రచన ఆధారంగా జాన్ బషీర్ దర్శకత్వంలో ఎస్.ఎం. బాషా బందం ప్రదర్శించారు. ముగింపు సభలో జంధ్యాల స్మారక పురస్కారాన్ని సినీ రచయిత బుర్రా సాయి మాధవ్‌కు అందజేశారు. అనంతరం బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

– మల్లేశ్వర రావు ఆకుల
79818 72655

ఉత్తేజాన్ని నింపిన 'లౌకిక కవనం'

ప్రస్తుతం మన దేశంలో లౌకికత్వం స్వరూపం మారిపోయిం ది. ప్రజాస్వామ్యం, లౌకికత్వం అనే మాటల్ని నిషేదించే ప్రయత్నాలు ఆరంభ మయ్యాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని భిన్నమతాల సామరస్య జీవనానికి చిచ్చుపెట్టింది. రాజ్యాంగంలోని లౌకికత్వానికి తూట్లు పొడిచే పనిచేస్తున్నది. బహుళ సంస్కృతుల భారతదేశానికి లౌకికత్వమే నిజమైన పునాది. అన్నివర్గాల ప్రజలు పాల్గొన్న జాతీయోద్యమ నేపథ్యంలోంచి రూపొందిన మన రాజ్యాంగం దానినే ప్రతిబింబిస్తున్నది. ఈ సంక్లిష్ట సందిగ్ధ సందర్భంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జనవరి 26 రిపబ్లిక్‌డే రోజు 'లౌకికకవనం' పేరుతో కవి గాయక సమ్మేళనం జరిగింది.

ఉదయం నుంచి దాదాపు రాత్రి 7 వరకు సాగిన ఈ సభలో రాష్ట్రం నలుమూలల నుంచి కవులు, గాయకులు రాజ్యాంగం అందించిన లౌకిక స్ఫూర్తిని చాటుతూ కవులు తమ స్వీయ కవితలను, గాయకులు తమ పాటలను వినిపించి ఉత్తేజం కలిగించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఐఏయస్ అధికారి ఏఎండి ఇంతియాజ్, ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య, ప్రముఖ కవయిత్రి మందరపు హైమావతి, పోలవరపు సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఛైర్మన్ గోళ్ళ నారాయణరావు ప్రారంభ సభలో పాల్గొని సందేశం ఇచ్చారు. ప్రముఖ కవి చలపాక ప్రకాష్, సామాజిక పరివర్తన వేదిక బాధ్యులు వున్నవ వినయ్‌కుమార్, ఎక్స్‌రే సాహిత్యసంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయరాజు, ప్రముఖ జర్నలిస్టు ఘంటా విజయకుమార్, కథారచయిత్రి కె.ఉషారాణి, సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిళ్ళా కుమారస్వామి తదితరులు ఆత్మీయ సందేశాలు ఇచ్చారు.

ఈ కవిగాయక సమ్మేళనంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 75 మంది కవులు, గాయకులు పాల్గొన్నారు. ప్రారంభ సభ అనంతరం కవిగాయక సమ్మేళనం తొలి సెషన్‌ను సరికొండ నరసింహరాజు, రెండవ సెషన్‌ను అమూల్య చందు, మూడవ సెషన్‌ను శిఖా–ఆకాష్, తంగిరాల సోని, కె.ఎక్స్. రాజు సంయుక్తంగా నిర్వహించారు. అనిల్ డ్యాని సమన్వయం చేశారు. ప్రముఖ గాయకులు జగన్, చంద్రనాయక్, పి.వి రమణ, గడ్డం విజయరావు, ఎస్.అనిల్ తదితరులు అభ్యుదయ, లౌకిక స్ఫూర్తిని నింపే పాటలను పాడి సభికుల్లో ఉత్తేజం నింపారు.

కవులు రాజ్యాంగస్ఫూర్తిని, లౌకకత్వ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆలోచనాత్మకమైన కవితలతో అలరించారు. అమూల్య చందు తన కవితలో.. 'ఇప్పుడు /జెండాలోని మూడు రంగుల్ని /మూడు మతాలూ /గుప్పిట్లో పెట్టుకుని/ విగ్రహాలుగా మలిచి/ జాతీయ దినోత్సవాలకు బదులు/ విగ్రహ దినోత్సవాలకు/ రిబ్బన్ కట్ చేస్తుంటే../ ఏ జెండా గురించి చెప్పాలి/ ఏ రాతలు రాయాలి... అంటూ ఆలోచింపజేసే కవిత చదివారు. ఈ దేశంలో సాగుతున్న మతోన్మాద రాజకీయాలు, అపహాస్యమౌతున్న ప్రజాస్వామ్యవిలువల్ని పదునుగా పలువురు కవులు ప్రశ్నించారు. ప్రముఖ కవి శిఖా–ఆకాష్ 'ఏదీ ఆగిపోలేదు' శీర్షికన రాసిన కవితలో 'ఏదీ ఉన్నచోట లేదు/ స్థానభ్రంశమైన కల నడుస్తూనే ఉంది/ కాస్త కాస్త వెనక్కి –/ ఆగిపోలేదు తిరో గమనం/ సాగిపోతూనే ఉంది –/ ..../ దేవుడు కూడా వ్యాపార వస్తువే !/ రాజకీయ కుట్రదారుల బంధువే !/ ఏదీ ఆగిపోలేదు, తిరోగమనం/ సాగిపోతూనే ఉంది' అంటూ స్పందించారు. కోగిలి రాజశేఖర్ 'కొందరు కులాల కుంపట్లలో/ మరికొందరు మతాల మత్తుల్లో/ సామాన్యుడిలో విషబీజాలు నాటారు/ ప్రజాస్వామ్యానికి తూట్లుపొడిచారు' అంటారు. కవి జి.మాల్యాద్రి 'సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యాడు/ అరాచకం జైశ్రీరాం గీతాలాపన చేస్తుంది/ నుదిట పచ్చబొట్టు /హిందూమతమై వర్ధిల్లినది/ చితాభస్మం విభూదిపండులా పంచబడుతుంది' అంటూ చదివిన కవిత ఆలోచింపచేస్తుంది.

కవి దివ్వెల వెంకట నరసయ్య 'నేను' అనే కవితలో "సమసమాజ నిర్మాణానికి సర్వసత్తాక సామ్యవాదానికి సూత్రం/భరతజాతికి బైబిల్, ఖురాన్, గీత ఏకత్వానికి గీటురాయి' అంటారు. కవి పిళ్ళా కుమారస్వామి 'ఆవాజ్' కవితలో..'మతం ముసుగేసుకుని బతకమని చెప్తోంది /మతోన్మాదం విద్వేషపు బీజాలను మనసులో నాటుతోంది/ ప్రేమ అందరి హదయాల్లో పూలు పూయిస్తుంది/ రాజ్యాంగం దేశంలో ఎలా బతకాలో చెపుతుంది/ ఉన్మాదానికి ఉరివేస్తుంది/ ప్రేమకు పల్లకి వేస్తుంది.' అంటారు. రాధాకృష్ణ కర్రి అనే కవయిత్రి 'కొత్త అజెండా' అనే కవితలో విరోదాభాసలంకారంతో ఒక కవితావాక్యం రాస్తుంది. "స్వేచ్ఛ కూడా ఎప్పుడు పడితే అప్పుడు వస్తుందేమో రావద్దని చెప్పు/ రాసిన రాతగాడు కూడా మార్చలేని లోకం ఇప్పుడున్నది" అంటుంది. ఈ కవితావాక్యం లోతైన అర్ధాన్ని, ఆలోచనను కలిగిస్తుంది.

ఈ లౌకిక కవనంలో సామినేని విజయ (విజయవాడ), టి.రవీంద్రబాబు, సి.హెచ్. రాము, సయ్యద్ జానీ భాషా (గుంటూరు), బివి శివప్రసాద్, సత్యవతి, జి.సి. రామలింగారెడ్డి (నంద్యాల), రాధకృష్ణ, సంపటం దుర్గాప్రసాద్, మరియ పీటర్, చోడవరపు రూప, దుంపాల వీరేష, చంటి, వి.శ్రీఉమామహేశ్వరి, తదితర కవులు లౌకికత్వం ఎంత ప్రమాదంలో పడిందో తమ కవితల్లో వ్యక్తీకరించారు. లౌకికకవనంలో కవులు, గాయకులు లౌకికత్వాన్ని కాపాడుకోవాలని, ముఖ్యంగా మతోన్మాద సంకెళ్లనుండి దేశానికి విముక్తి కలిగించాలని ప్రతినబూనారు. ఈ కవిగాయక సమ్మేళనాన్ని వొరప్రసాద్, కెంగార మోహన్, సత్యాజీ, శాంతిశ్రీ, సత్యరంజన్, గుండు నారాయణ, లక్ష్మయ్య సమన్వయం చేశారు.

- కెంగార మోహన్,
రాష్ట్ర అధ్యక్షులు, సాహితీస్రవంతి.
94933 75447.

లౌకిక కవనంలో కవితాగానం చేస్తున్న దృశ్యం

పదిహేనేళ్ళ ప్రరవే ప్రయాణం

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ఏర్పడి పదిహేనేళ్ళు. అంతకు ముందు 'మనలో మనం' ఏడాది ప్రయత్నంతో కలిపి పదహారేళ్లు. 2024 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో 'స్త్రీలపై ట్రోలింగ్' అంశంగా ఖమ్మంలో ఏడవ మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సమాజ చలనంలో ప్రరవే నిర్వహించిన పాత్ర గురించి కొంతమంది రచయిత్రుల అభిప్రాయాలూ సూచనలూ ఇవీ ...

గ్రామీణ స్త్రీలని చైతన్య పరచాలి

ప్రరవే కలెక్టివ్‌గా చేసే పని తీరు బాగుంటుంది. గత ఏడాది జూమ్ ద్వారా నిర్వహించిన 35 వారాల ప్రపంచ ఫెమినిస్ట్ రచయిత్రులపై ధారావాహిక ప్రసంగాల పరంపర ఎంతో ఉపయోగపడేదిగా ఉంది. ఇలాంటివి పాఠ్యాంశాల్లో చేర్చాలని మనం డిమాండ్ చేయాలి. స్త్రీలపై జరిగే అత్యాచారాలు, హింస ఇలాంటి అంశాలపై పబ్లిక్ మీటింగులు ఎక్కువగా జరగాలి. ఎలిమెంటరీ పాఠశాలల నుంచి కళాశాలల వరకు బాలికలను చైతన్య పరచాలి. గ్రామీణ స్త్రీలకు లోకజ్ఞానం తక్కువగా ఉండి అనేక బాధలు, కష్టాలు పడ్తుంటారు. వారిని చైతన్యపరిచే దిశగా అడుగులు వేయాలి.

– డా. బి.విజయభారతి

ప్రతిఘటన నేటి అవసరం

ఇది పదిహేనేళ్లగా నిర్మాణాత్మకంగా నిబద్ధతతో పనిచేస్తున్న వేదిక. ఏడవ మహాసభల్లో సామాజిక మాధ్యమాల్లో స్త్రీలపై జరుగుతున్న అమానవీయ దాడుల గురించి మాట్లాడతారు. ఈ దాడులు సామాజిక అలజడికి కారణమవుతున్నాయి. దాన్ని కలంతో గళంతో ఎదుర్కోవడం నేటి అవసరం.

– డా. ముదిగంటి సుజాత రెడ్డి

వీలైనంత మందిని కలుపుకుంటూ ...

నేను అయిదారుసార్లు ప్రరవే సభల్లో వేదిక పంచుకుని నా అభిప్రాయాలు వినిపించాను. మొదట్లో అన్ని ప్రాంతాల్లోనూ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను కూడా కలుపుకుంటూ సభలు జరిపిన ప్రరవే నాకు గుర్తుంది. గుంటూరులో జరిగిన అనువాదాల సదస్సులో కూడా పాల్గొన్నాను. ప్రరవే పలు అంశాలను చర్చకు పెడుతూ, సమకాలీన సమస్యలను అందరి దష్టికి తీసుకొస్తూ సభలు నిర్వహిస్తున్న తీరు ముదావహం. ఈ విధంగా పదిహేనేళ్ల ప్రరవే స్త్రీల రచనల వైపుగా చేసిన కషి ప్రశంసనీయం.

– వాడ్రేవు వీరలక్ష్మీదేవి

యాభై ఏళ్ల సభలో పాల్గొనాలని ...

ఈ వేదిక ప్రయాణం అంత సులువు కాదు. మనం మననే కాదు సాటి వారిని కూడా అక్కున చేర్చుకోవాలి. మెదడుని కదిలించే ఉపన్యాసాలు ఎంతో కొంత సమాజానికి కొత్త ఆలోచనని ఇచ్చాయి. సమాజంలో నిర్మాణాత్మకమైన ప్రరవే పాత్ర మరువలేనిది. నిబద్ధత ఉన్న బలమైన నారీలోకపు కొత్త ఆలోచనలకి ఆహ్వానం పలుకున్న సంస్థకి మేలు తలపులు. యాభై ఏళ్ల సభలో పాల్గొని నా అనుభవాలు చెప్పాలని కలలు కంటాను.

– మన్నం సింధు మాధురి

తమ చూపుని నలుదిశలా సారిస్తూ ...

ప్రరవే యీ సమాజంలోని అన్ని సమూహాలని కలుపుకుంటూ సాగుతున్న వొక డెమొక్రటిక్ ప్లేస్. యెప్పటికప్పుడు సమాజంలో వస్తున్న మార్పుల్ని, వాటితోపాటు వస్తున్న అభివృద్ధిని, సమస్యలను చర్చించి పరిష్కారాలని కనుగొనడానికి ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారి వుపన్యాసాలని, రచనల్ని అందిస్తోంది. విభిన్న అంశాలపై అందరి గొంతునీ వింటూ, వినిపిస్తూ, అన్ని తరాల సమ్మిళితమైన రచనా సంకలనాలని ప్రచురిస్తూ కొత్త రచయితలకి వుత్సాహాన్ని కలిగిస్తుంది. ప్రతి అంశాన్ని తడుతూ అన్ని సమూహాల్ని, వ్యక్తులని కలుపుకుంటూ నిత్య నూతనంగా ప్రయాణిస్తోంది.

– కుప్పిలి పద్మ

పసిడి రెక్కల మీది బాధ్యత



ఇరవై ఏళ్ల క్రితం సాహిత్యంలో సామాజిక జీవనంలో ఒక స్తబ్దత ఏర్పడింది. ఆ సమయంలోనే ఒక కర్తవ్యాన్ని వెతుక్కుంటూ ప్రరవే ఏర్పడింది. అన్ని అస్తిత్వాలకి ఈ వేదిక ప్రాతినిధ్యం వహించలేకపోవచ్చు. కానీ, అస్తిత్వాన్ని స్థిరపరుచుకోవడానికి అవసరమైన మేధోసామగ్రిని అందిస్తున్నది. వేయి అస్తిత్వాలు వికసించాలి. వైవిధ్యం వైపు దారి తీయాలి. బహుళతకు అర్థం తెలియాలి. ప్రరవే పసిడి రెక్కల మీద ఈ బాధ్యతని మోయాలి.

– గోపరాజు సుధ

ఇటువంటి స్పేస్ అవసరం

ఈ వేదిక గురించి తెలుసుకుని ఒకటిన్నర దశాబ్దమైంది. వివిధ అస్తిత్వాలకు చెందిన మహిళల అంతర్బాహిర్ ప్రపంచాలన్నింటిని కలుపుకు పోయే ప్రరవే ఒక జ్ఞాన భాండారం. ప్రతి ఏడూ జరిగే వార్షిక సదస్సులు, రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభలు, మహిళా సాహిత్య కోణాలను విశ్లేషించడమే కాక గుర్తించాల్సిన జెండర్ అంశాలను హైలైట్ చేస్తాయి. మహిళల కొరకు, మహిళలచే సష్టించబడిన ఈ సాహితీ కూడికలో భాగమైన ప్రతిసారీ ఇటువంటి స్పేస్ ఆవశ్యకత అర్థమవుతుంటుంది.

– అపర్ణ తోట

ట్రోలింగ్‌పై చర్చ సాహసమే!

ఇప్పటికీ చాలామంది మహిళలు తమ ఇంట్లో కూడా నోరు మెదపలేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి అననుకూల వాతావరణంలో ప్రరవే మహిళల గొంతుకైంది. ప్రతి ఏడు కొత్త అంశాలతో ముందుకొచ్చి మహిళలు ఇంటా బయటా నిర్ణయాధికారం వైపు అడుగులేసే విధంగా చైతన్య పరుస్తోంది. మహిళలను అత్యంత ఇబ్బంది పెడుతున్న ట్రోలింగ్ పై చర్చ లేవనెత్తడం నిజంగా పెద్ద సాహసమే. ఈ సారి నేను ఇందులో భాగమై అందరితో గొంతు కలపాలని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను.

– రూబీనా పర్వీన్

అభిప్రాయ సేకరణ : మానస ఎండ్లూరి

కావొచ్చు...

వెలుగు దారుల వెంట
నడుస్తున్నామనుకుంటున్నాం కావొచ్చు
ఒక ఆలోచన గొంతు ముడి విప్పి
పాడుతున్నామనుకుంటున్నాం కావొచ్చు
ఎగసే మహోగ్ర చైతన్య జ్వాల
ఒక రాజకీయ సైగకి తల వాల్చేయవచ్చు

బలవంతుడి దండ ధిక్కారానికి
స్వరం మునగదీసుకు పడుకోవొచ్చు
పుక్కిట పురాణాల నెమరువేతలో
సుషుప్తి పడుతున్నాం కావొచ్చు

సమయం చూసి
ఒక చీకటి బిలంలో
సమాధి బద్దలు కొట్టి
ఒక సనాతన ఘాతం
నీలో రెక్కలు విప్పొచ్చు.

నీలో అప్పుడొక
సుఖసెలయేరు ప్రవహిస్తూ
వందిమాగధులు వింజామరలు విసరొచ్చు
నీ చుట్టూ ఒక భ్రమభ్రమరం నిన్ను
నిస్తేజితుణ్ణి చేయొచ్చు
ఉత్తేజితుణ్ణీ చేయొచ్చు
ఒక మత్సర మత్తేభం
లోపల్లోపలే నిన్ను
కసాబిసా తొక్కేయవచ్చు.

అపవిడిక
రోడ్డు మీద స్త్రీ ఆక్రందన
నీ చెవులు విసిరికొట్టొచ్చు..
ఒక అధోగతుడి ఆక్రోశం
నీ కళ్ళు దులుపుకోవచ్చు
సామూహిక గృహ దహనం
నీ అచేతనలో నీరుగారవచ్చు.

అయోధ్యను ఖాళీ చేసిన జగదభిరాముడు
జయజయ ధ్వానాల మధ్య
నీకు కనిపించకపోవచ్చు
అప్పుడు నువ్వొక
చర్చీపైన కట్టిన
ఎగిరే హనుమ కావొచ్చు.
మసీదు ముందు
బలవంతంగా బైఠాయించిన
రామభజన కావొచ్చు.

భక్తి వ్యాపార సామ్రాజ్యంలో
నువ్వొక మారక వస్తువై తరించొచ్చు
కళ్ళ ముందు కామం తెరలు కమ్ముకోవచ్చు
లోన నిద్రపోతున్న
ఉన్మాదపు సింహాన్ని నిద్రలేపి
అత్యాచార స్వైరవిహారం చేస్తూ
భారతమాత గర్జనలు చేయొచ్చు

నిలువెత్తు విగ్రహాల కింద
దేశ వెన్నెముకల విత్తన కలల్ని జీర్ణం చేయొచ్చు
వీధుల్లో తలకు గుడ్డ చుట్టుకొని
ఒక శూలానికి గుచ్చి ఎత్తిన
నవజాత శిశువు
జీవరహిత కనులు కావొచ్చు
వాట్సప్ అబద్ధపు చరితల మాటున
మన ఎదుటనే మనం
మెల్లమెల్లగా కూలిపోవడం చూస్తూ
అక్షితలు జల్లుకొని జైకొట్టుకోవచ్చు.

ఒక సీసా మతం మందు ఎక్కిస్తే
మనం మనం కాకుండా పోవచ్చు.
ఏ విగ్రహారాధకుల పాదాల దగ్గరో
దక్షిణల పక్కన విబూది బూడిదై పడుండొచ్చు!

– పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

కాలంతో సవారీ

కాలంతో పోటీపడటం అంత సులువు కాదు
కష్టాల కడలిలో చిక్కుకొని
అంతుచిక్కని పద్మవ్యూహంలో బందీ అయిపోయిన
మనిషి బతుకు అంతు చిక్కని రహస్యం.
మోసం చాటున నడుస్తున్న సమాజం
నేర్పుతున్న పాఠం బాగా కంఠస్తం అవుతుంది.

చెమట తడిసిన దేహంతో ఎన్నోసార్లు
నన్ను నేను ప్రశ్నించుకున్నాను
నన్ను నేను నిందించుకున్నాను
నన్ను నేను పరామర్శించుకున్నాను
మాయ మనుషుల మర్మం తెలిసినపుడు
నలుగురి మధ్యలో బతకడం అంటే ఇదే అని
నన్ను నేను ఓదార్చుకున్నాను.

ఆకాశమంత జీవితంలో నల్లని మేఘాలు
అల్లుకొని శూన్యపు చీకటిలో కొట్టుమిట్టాడుతుంటే
ఒంటరి నక్షత్రాన్నయ్ గుండెలో ధైర్యపు
వెలుగును నింపుకొని ప్రయాణించడం
అంత సులువేం కాదు

కాలంతో సవారీ చెయ్యడం ఒక సవాలే
ఓరకన్నుతో ఎక్కడో దాక్కుని చూస్తున్న
విజయానికి ఒక సవాల్ విసురుతున్న.
నువ్వు కష్టాల వర్షమై కురిసినా...
తుపానువై తన్నుకొస్తున్నా
ధైర్యాన్ని గొడుగుగా చేసుకొని వస్తాను.
సూర్యుడై వెలుగుతాను.

– అశోక్ గోనె
9441317361

లలిత గజల్

కలిసి నడిచే మనుషులతో దూరం దగ్గరవుతుంది
కలిసి చరించే మనసులతో భారం నెమ్మదవుతుంది
అహంకారపు పొరలు కమ్మితే అంతా నరకమే
హృదయం విశాల పరచుకో జీవితం స్వర్గమవుతుంది

నీకోసం నీవే బతికితే ఏమున్నది పరమార్థం
పరులకై బతికిచూడు హృదయం స్వచ్ఛమవుతుంది
ఎదుటివారి తప్పులే ఎత్తిచూపకు ఎప్పుడూ
నీలోకి తొంగి చూడు అంతరంగం స్పష్టమవుతుంది

కఠినమైన ఊహలకు తావివ్వకు నేస్తమా
లలిత భావాలు పంచిచూడు లోకం సొంతమవుతుంది!

– లలితావర్మ

ప్రజా ఉద్యమాలు విస్తృతమవ్వాలి

- లెనిన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి
- లెనిన్ శత వర్ధంతి సభలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ

ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో విస్తృతమైన ప్రజా ఉద్యమాలు రావాల్సిన అవసరముందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నొక్కి చెప్పారు. మితవాదశక్తులతో ఏర్పడుతున్న ప్రభుత్వాలు ప్రపంచ కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా పాలన చేస్తున్నాయని వివరించారు. మంచి పుస్తకం, రెడ్‌బుక్ డే సంయుక్త ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభను ఆన్‌లైన్ వేదికగా నాగార్జున యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి అంజిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రపంచంలో మార్పు రావాలని కారల్‌మార్క్స్ కోరుకుంటే.. లెనిన్ ఆచరణలో రష్యా విప్లవం ద్వారా చూపించారని కొనియాడారు. విప్లవ పోరాటాన్ని సరైన మార్గంలో తీసుకుపోవడంలో లెనిన్ విజయవంతమయ్యారన్నారు. లెనిన్ తన జీవితకాలంలో విస్తృత అధ్యయనం ద్వారా రచనలు చేశారనీ, అవన్నీ విప్లవోద్యమ నిర్దేశిత అవసరాలు తీర్చడానికే తప్ప పాండిత్య ప్రదర్శన కోసం చేయలేదని చెప్పారు. ఉద్యమాన్ని, పార్టీ నిర్మాణాన్ని వేరు చేసి చూడకూడదన్నారు. ఉద్యమ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణం, నిర్మాణ సామర్థ్యానికి లోబడి ఉద్యమ పురోగతి ఉంటుందని వివరించారు. ఆయన రచనలను పరిశీలిస్తే రష్యా విప్లవ గమనంలోని ఒక్కో ఘట్టం ముగింపు, ప్రారంభం కనిపిస్తాయని గుర్తుచేశారు. లెనిన్ రచనలను అధ్యయనం చేసేటప్పుడు వాటి ఆవశ్యకత, చారిత్రక పరిస్థితులు, ఉద్యమ అవసరాలు, తదితరాలను గమనంలో పెట్టుకుని చదవాలని సూచించారు. మార్క్సిస్టు రచయిత, విశ్లేషకులు పాల్ లీ బ్లాంక్ మాట్లాడుతూ.. లెనిన్ విప్లవోద్యమం పట్ల ఎంత అకుంఠిత దీక్షను కలిగి ఉన్నాడో విప్లవ శ్రేణుల పట్ల కూడా అంతే ఆదరాభిమానాలను కలిగి ఉన్నాడని కొనియాడారు. విప్లవోద్యమ పురోగమనంలో సహచరులతో లెనిన్‌కు నెలకొన్న భినాభిప్రాయాలు రాజకీయపరమైనవే తప్ప వ్యక్తిగతం కాదని ఆయన జీవితాన్ని అధ్యయనం చేస్తే తెలుస్తుందన్నారు. విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో ఏ సానుకూల అంశం, పద్ధతి, ముందుకొచ్చినా దాన్ని స్వీకరించేంత విశాల మనసు కలిగిన విప్లవ నేత లెనిన్ అని కొనియాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మితవాదులు ఫాసిస్టు ధోరణులున్న శక్తులు పేట్రేగుతున్న తరుణంలో లెనినిస్టు ఆచరణ విప్లవోద్యమాలకు, ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలకు కరదీపికగా ఉంటుందని నొక్కి చెప్పారు. లెఫ్ట్‌వర్డ్ సంపాదకులు విజయప్రసాద్ మాట్లాడుతూ.. సమకాలీన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మార్క్సిస్టు అధ్యయనం ఎంత అవసరమో దాన్ని మార్చడానికి లెనినిజం అంతే అవసరమన్నారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలు విప్లవమే అంతిమ లక్ష్యంగా.. సమకాలీన ఆర్థిక, సామాజిక, అంతరాలను, వివక్షను ప్రతిఘటించేందుకు సామాజిక న్యాయాన్ని సాధించేందుకు పనిచేయడమే లెనిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

తెలంగాణకు బీహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- 12న బలపరీక్ష ఎదుర్కోనున్న నితీష్ ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీహార్ రాష్ట్ర రాజకీయ సంక్షోభానికి తెలంగాణ వేదిక అయింది. ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణలో ఏర్పాటు చేసిన క్యాంపునకు తరలివచ్చారు. 16 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ఒక ఎమ్మెల్సీ మదన్మోహన్ ఈ క్యాంపునకు తరలి వచ్చిన వారిలో ఉన్నారు. ఈ నెల 12వ తేదీన నితీష్ కుమార్ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కొననుంది. అప్పటి వరకు బీహార్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం పరిధిలోని కాగజ్‌గట్ సిరి రిసార్ట్‌లో విడిది కానున్నారు. వారిని భారీ పోలీసు బందోబస్తు మధ్య క్యాంపునకు తరలివచ్చారు. ఈ క్యాంపు.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సారథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కనుసనల్లో కొనసాగుతుంది. జేడీయూ అధినేత నితీష్‌కుమార్ ఇండియా కూటమిలో నుంచి ఇటీవల ఎన్డీఏ కూటమిలోకి చేరిన విషయం తెలిసిందే. దాంతో బీహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమిగా ఏర్పడింది. ఇటీవల జెడియు, బిజెపి కూటమి ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ తరుణంలో నితీష్‌కుమార్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును ఉపసంహరించుకుంది. కాగా ఈ నెల 12వ తేదీన నితీష్‌కుమార్ బల పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంది. కాంగ్రెస్‌కి మొత్తం 19మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో 16 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ కాగజ్‌గట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపునకు చేరుకున్నారు. వీరు సుమారు 7 రోజుల పాటు సిరి రిసార్ట్‌లో ఉండనున్నారు.

కాల్పులు జరిపిన బిజెపి ఎమ్మెల్యేపై ఎస్‌సి, ఎస్‌టి కేసు

థానే : పోలీస్ స్టేషన్‌లోనే శివసేన నాయకుడిపై కాల్పులకు దిగిన మహారాష్ట్రలోని బిజెపి ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్‌పై ఎస్‌సి, ఎస్‌టి (వేధింపులు నిరోధక) చట్టం కింద కేసు నమోదయింది. ద్వార్లి గ్రామానికి చెందిన ఒక గ్రామస్థుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, మరో ఏడుగురిపై థానే జిల్లాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైందని ఆదివారం పోలీసు అధికారులు వెల్లడించారు. ఒక భూమి యజమానురాలు అయిన మహిళపై కులపరమైన వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై విచారణ జరుగుతోందని పోలీసులు చెప్పారు.

జిల్లాలోని హిల్ లైన్ పోలీస్ స్టేసన్‌లో సీనియర్ ఇన్‌స్పెక్టర్ క్యాబిన్‌లోనే శుక్రవారం రాత్రి శివసేన నాయకుడు మహేష్ గైక్వాడ్‌పై కల్యాణ్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ ఆరు బుల్లెట్లతో కాల్పులకు తెగించాడు. దీంతో మహేష్ గైక్వాడ్, అతని సహచరుడు రాహుల్ పాటిల్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హత్యాయత్నం, ఇతర అభియోగాలతో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది.

పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని

గౌహతి : అసోంలోని రూ.11,600 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో సుదీర్ఘకాలంపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు భారత్‌లోని పవిత్ర స్థలాల ప్రాముఖ్యతను గుర్తించడంలో విఫలమయ్యాయని అన్నారు. దేశంతోపాటు దక్షిణాసియాలో ఈశాన్య ప్రాంత అనుసంధానాన్ని ఇవి మెరుగుపరుస్తాయని తెలిపారు. గత దశాబ్ద కాలంలో రికార్డు స్థాయిలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారన్నారు. గత జ్ఞాపకాలను తుడిచేసిన ఏ దేశం కూడా పురోగతి సాధించలేదన్నారు. అవి కేవలం పర్యాటక ప్రదేశాలు మాత్రమే కాదని, వేల ఏళ్లనాటి భారత నాగరికతకు చిహ్నాలు అని పేర్కొన్నారు.

ఎన్ని కుట్రలో..

- బిజెపిలో చేరితే ఇబ్బందులు ఉండవన్నారు
- నేను చేరనని చెప్పా... తలవంచే ప్రశ్నే లేదు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ : బిజెపిలో చేరితే ఇబ్బంది పెట్టబోమని తనకు చెప్పారని, అయితే అందుకు తాను అంగీకరించలేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఎట్టి పరిస్థితులలోనూ బిజెపితో చేతులు కలిపే ప్రశ్నే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆప్ ఎమ్మెలేలను బిజెపి ప్రలోభపెట్టిందంటూ కేజ్రీవాల్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ ఆయనకు, రాష్ట్ర మంత్రి అతిషికి నోటీసులు జారీ చేసింది. ఆరోపణలకు సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరింది. దీనిపై వివాదం కొనసాగుతుండగానే కేజ్రీవాల్ ఆదివారం ఢిల్లీలోని రోహిణిలో ఓ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు.

'వారు ఏం చేయాలనుకుంటే అది చేసుకోవచ్చు. ఏ కుట్ర అయినా చేసుకోవచ్చు. జరిగేదేమీ ఉండదు. నేను వారికి తలవంచే ప్రశ్నే లేదు. నా వైఖరి దృఢంగా ఉంది. బిజెపిలోకి వస్తే ఇబ్బంది పెట్టబోమని వారు చెప్పారు. అయితే ఆ పార్టీలో చేరే ప్రశ్నే లేదు. వారు మమ్మల్ని క్షమించడానికి మేము ఏం తప్పు చేశాం?' అని ప్రశ్నించారు. పాఠశాలలు, ఆస్పత్రులు, క్లినిక్కులు, రోడ్లను మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నామనీ, అందులో తప్పేముందని అన్నారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు బిజెపి ప్రయత్నించిందంటూ కేజ్రీవాల్ చేసిన ఆరోపణకు సంబంధించి మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలంటూ క్రైమ్ బ్రాంచ్ అధికారులు శనివారం కేజ్రీవాల్‌కు నోటీసు ఇచ్చారు. మంత్రి అతిషికి ఆదివారం నోటీసు అందజేశారు. బిజెపిలో చేరితే ఒక్కొక్కరికీ పాతిక కోట్ల రూపాయలు ఇస్తామని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ కూడా ఇస్తామని ఆశ చూపుతూ ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు బిజెపి ప్రయత్నించిందని గత నెల 27న కేజ్రీవాల్, అతిషి ఆరోపించారు. ఈ ఆరోపణల్ని బిజెపి తోసిపుచ్చింది. బిజెపి ఆశ చూపిన ఆప్ ఎమ్మెల్యేలు ఎవరో తెలుసుకునేందుకు పోలీసులు ఆ పార్టీ సీనియర్ నేతలను సంప్రదించారు.

'క్రైమ్ బ్రాంచ్ విచారణ జరిపింది. ఆప్‌ను వదిలి బిజెపిలో చేరితే పాతిక కోట్ల రూపాయలు ఇస్తామని ఎమ్మెల్యేలకు ఆశ చూపినట్లు మీరు చేసిన ఆరోపణపై ఫిర్యాదు అందింది. మీరు జనవరి 27న సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ ఆరోపణని పోస్ట్ చేశారు. మీ ట్వీట్‌ను చదివితే నేరానికి సంబంధించిన సమాచారం మీ వద్ద ఉన్నదని అర్థమవుతోంది. అందువల్ల మీ సమాధానాలు కోరుతూ ఓ ప్రశ్నావళిని జత చేస్తున్నాం. దానికి సోమవారంలోగా సమాధానాలు పంపండి' అని ఆ నోటీసులో క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సూచించారు.

గిరిజనుల హక్కుల కోసం నిలబడతాం

- బిజెపిపై రాహుల్ ఆగ్రహం

రాంచీ : గిరిజనుల హక్కుల కోసం నిలబడతామని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా జార్ఖండ్‌లో ఆయన పర్యటించారు. ధనబాద్ జిల్లాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. 'జల్- జంగిల్- జమీన్'పై గిరిజనుల హక్కుల కోసం తమ పార్టీ నిలబడుతుందని రాహుల్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి తుండి ప్రాంతంలో ఆగిన ఆయన యాత్ర.. తిరిగి ధనబాద్‌లోని గోవింద్‌పూర్ నుంచి ప్రారంభమైంది. ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వ రంగాన్ని కట్టబెట్టకుండా రక్షించటం, దేశంలోని నిరుద్యోగ యువత, గిరిజనులకు న్యాయం కల్పించటమే ఈ యాత్ర ముఖ్యోద్దేశం అని రాహుల్ అన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు నోట్ల రద్దు, జిఎస్‌టితో దేశంలో నిరుద్యోగాన్ని పెంచిందని రామ్‌గఢ్‌లో ఆయన ఆరోపించారు. జార్ఖండ్‌లో రాజకీయాలు వేడెక్కిన నేపథ్యంలో రాహుల్ యాత్ర రాష్ట్రంలోకి ప్రవేశించటం గమనార్హం.

అసలైన ఉగ్రవాది నెతన్యాహునే !

- పీపుల్స్ డిస్పాచ్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లేబరేషన్ ఆఫ్ పాలస్తీనా నేత హేథమ్ ఆబ్డో

గాజా: అక్టోబరు 7న జరిగిన దాడిని చూపి పాలస్తీనా ప్రతిఘటన శక్తులను ఉగ్రవాదులని అమెరికా,ఇతర పశ్చిమ దేశాలు ముద్ర వేస్తున్నాయి. ఇది నిజం కాదు, అసలైన ఉగ్రవాది యూదు దురాక్రమణదారుడైన ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహునే అనిపాపులర్ ఫ్రంట్ ఫర్ ది లేబరేషన్ ఆఫ్ పాలస్తీనా నేత హేథమ్ ఆబ్డో అన్నారు. ఆయన పీపుల్స్ డిస్పాచ్ ప్రతినిధి బ్రియాన్ బెకర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం స్పష్టం చేశారు. ఉగ్రవాది గురించి మాట్లాడేటప్పుడు ఉగ్రవాదికి నిర్వచనం ఏమిటో తెలుసుకోవాలి. తమ మాతృభూమిని రక్షించుకోవడం కోసం పోరాడేవారు తీవ్రవాదా? ప్రజల కోసం యుద్ధం చేసేవారు ఉగ్రవాదులా? లేక మా భూములను దౌర్జన్యంగా లాక్కొని, మా ప్రజలను ముఖ్యంగా పిల్లలు, మహిళలు అనే విచక్షణ లేకుండా ఊచకోత కోసేవాడు ఉగ్రవాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. 'యుద్ధోన్మాది నెతన్యాహుకు అమెరికన్ సామ్రాజ్యవాదం మద్దతు ఇస్తున్నది. తమ మాతృభూమిని పరిరక్షించుకునే హక్కు, మా భూమికి తిరిగి వచ్చే హక్కు మాకు ఉన్నది' అని ఆయన స్పష్టం చేశారు.

కాల్పుల విరమణ గురించి ప్రస్తావిస్తూ పాలస్తీనా ప్రజలపై దురాక్రమణ ఆపాలి. గాజాలోని ప్రజలకు అవసరమైన ఆహారం, ముందులు, ఇతర నిత్యావసర సరఫరాలను పునరుద్ధరించాలి. ఇజ్రాయిల్ దాడుల్లో ధ్వంసమైన మౌలిక వసతుల పునర్నిర్మాణానికి వీలు కల్పించాలి. ఇవన్నీ జరగాలంటే కాల్పుల విరమణ అత్యంతావశ్యకం అని ఆయన చెప్పారు.

నెతన్యాహుకు ఈ యుద్ధం ఆపాలని ఏ కోశానా లేదు. పైగా దీనిని యావత్ పశ్చిమాసియా ప్రాంతానికి విస్తరించాలని కోరుకుంటున్నాడు. ఎందుకంటే ఈ యుద్ధం ముగిసిన మరు క్షణమే అతను జైలుకు వెళ్లడం ఖాయం. ఈ విషయం అతనికి బాగా తెలుసు. అందుకే ఈ యుద్ధాన్ని పొడిగించాలని చూస్తున్నాడు. లెబనాన్, సిరియా వంటి దేశాలకు విస్తరించేందుకు యత్నిస్తున్నాడని హేథమ్ ఆబ్డో చెప్పారు.

ప్రపంచ ప్రజాభిప్రాయం ఇజ్రాయిల్‌కు, దాని పోషకులైన వాషింగ్టన్‌లోని స్పాన్సరర్లకు వ్యతిరేకంగా ఉంది. నెతన్యాహుకు మద్దతుగా బైడెన్ ప్రభుత్వం ఆయుధాలు, డబ్బు అందజేయడాన్ని వ్యతిరేకిస్తూ వాషింగ్టన్‌లో నవంబరు4న 5లక్షల మంది ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనాకు సంఘీభావంగా జనవరి13న మరోసారి లక్షలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ప్రతి రోజూ అమెరికా అంతటా పెద్ద యెత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలో గతంలో ఎన్నడూ ఇంతటి భారీ ర్యాలీలు లేవు. ఇది సరికొత్త యుగం. అమెరికాలో మాత్రమే కాదు, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ఇలా అనేక దేశాల్లో పాలస్తీనా సంఘీభావ ర్యాలీలు జరుగుతున్నాయని ఆయనె అన్నారు.

ఇది హమాస్‌పై యుద్ధం, ఉగ్రవాదంపై యుద్ధం అని పశ్చిమ దేశాల ప్రభుత్వాలు, వాటి అధీనంలోని మీడియా బాకాలు అదే పనిగా ఊదరగొడుతున్నాయి. అయితే ఇది నిజం కాదు. ఈ దురాక్రమణదారు దాడి గాజాపైనే కాదు, పాలస్తీనాప్రజలందరిపైనా అని ఆయన అన్నారు. వెస్ట్ బ్యాంక్‌లోను, ఇతర ప్రదేశాల్లోను ఏం జరుగుతుందో చూస్తున్నాం. పాలస్తీనా ప్రజలకు సహాయం అందించే ఐరాస సహాయక సంస్థకు నిధుల్లో పశ్చిమ దేశాలు కోతపెట్టాయి. ఇది పాలస్తీనీయులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న దాడి కాదా అని ఆయన ప్రశ్నించారు. పాలస్తీనా విమోచనా పోరాటం రాజకీయ సమస్య. సాయుధ పోరాటంతో సహా ఆక్రమణను నిరోధించే హక్కు అంతర్జాతీయ చట్టాలు కల్పిస్తున్నాయి. ఈ విషయం తెలిసి కూడా పాలస్తీనా ప్రతిఘటనా సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రపంచంలోని ప్రధాన సామ్రాజ్యవాద శక్తులైన అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా, జపాన్ ముద్ర వేయడం వాటి నైజాన్ని తెలియజేస్తోందని హేథమ్ ఆబ్డో అన్నారు.

మరో మైనారిటీ ఎన్జీఓపై వేటు

- ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్ రద్దు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ : విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించాయన్న కారణంతో ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్ల రద్దుల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా తమిళనాడు సోషల్ సర్వీస్ సొసైటీ రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. టిఎన్‌ఎస్‌ఓఎస్‌ఎస్ అనే పేరుతో ఉన్న ఈ సొసైటీ ప్రభుత్వేతర క్రైస్తవ సంస్థ. ఇది తమిళనాడు కాథలిక్ బిషప్పుల కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ సంవత్సరంలోనే తమిళనాడులో క్రైస్తవ సంస్థల ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడం ఇది రెండోసారి. గత నెల 20న వరల్డ్ విజన్ ఇండియా లైసెన్స్‌ను రద్దు చేశారు.

దానికి కొద్ది రోజుల ముందు న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ (సిపిఆర్)పై కూడా వేటు పడింది. తమ సంస్థ లైసెన్సును రద్దు చేయడానికి చూపిన కారణం అసమగ్రంగా ఉన్నదని, సహేతుకంగా లేదని ఆ సంస్థ అధ్యక్షురాలు యామినీ అయ్యర్ విమర్శించారు. ఎఫ్‌సిఆర్‌ఎకి పలు సవరణలు చేసినప్పటికీ అనేక ఎన్జీఓలపై ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తూనే ఉన్నాయి. దీంతో ఆయా సంస్థలు అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. వేలాది సంస్థల లైసెన్సులను రద్దు చేశారు. వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారు. తనను విమర్శించే ఎన్జీఓలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా ఎఫ్‌సిఆర్‌ఎను వాడుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇజ్రాయెల్ దాడిలో సర్వం కోల్పోయిన జర్నలిస్టుకు కేరళ అవార్డు

వేల్ అల్-దహదోహ్

తిరువనంతపురం: గాజా జర్నలిస్ట్ వేల్ అల్-దహదోహ్‌ను కేరళ మీడియా అకాడమీ జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సత్కరించబోతోంది. ఇజ్రాయెల్ దాడిలో అల్-దహ్దూ తన భార్య, ఇద్దరు పిల్లలు , మనవడిని కోల్పోయాడు. తన కళ్ల ముందే ఇజ్రాయెల్ దాడిలో తన కెమెరాపర్సన్ చనిపోవడం చూశాడు. అయినప్పటికీ, అల్ జజీరా యొక్క గాజా బ్యూరో చీఫ్ వేల్ అల్-దహ్దూ తన విధుల్లో స్థిరంగా ఉన్నాడు. జర్నలిజం పట్ల ఆయనకున్న నిబద్ధత, అంకితభావానికి ఈ పురస్కారం అని కేరళ మీడియా అకాడమీ పేర్కొంది. ఈ అవార్డుకు నామినేట్ అయినందుకు అల్-దహ్దూ సంతోషించినట్లు కేరళ మీడియా అకాడమీ నుంచి ఒక పత్రికా ప్రకటన తెలిపింది. ఈ అవార్డును అమూల్యమైన గౌరవంగా అభివర్ణించారు. జ్ఞాపిక, శిల్పం, రూ.లక్ష గౌరవ వేతనం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా అల్-దహ్‌దోకు అందజేయనున్నట్లు కేరళ మీడియా అకాడమీ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు, వివిధ వార్తాపత్రికల సంపాదకులతో కూడిన కమిటీ అల్-దహ్దూహ్ పేరును ఖరారు చేసినట్లు అకాడమీ తెలిపింది.

గూఢచర్య ఆరోపణలతో భారత్ ఎంబసీ ఉద్యోగి అరెస్టు

- విచారణకు సహకరిస్తున్నామన్న కేంద్ర విదేశాంగశాఖ

న్యూఢిల్లీ : రష్యాలో భారత రాయబార కార్యాలయ ఉద్యోగిని గూఢచార్య ఆరోపణలతో అరెస్టు చేసిన కేసులో సంబంధిత దర్యాప్తు అధికారులకు సహకరిస్తున్నామని కేంద్ర విదేశాంగ శాఖ ఆదివారం ప్రకటించింది. 'మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో సెక్యూరిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సతేంద్ర సివాల్‌ను ఉత్తరప్రదేశ్‌లో అరెస్టు చేసిన విషయం కేంద్ర విదేశాంగ శాఖకు తెలుసు. ఈ విషయంలో దర్యాప్తు అధికారులతో కలిసి విదేశాంగ శాఖ పనిచేస్తోంది' అని అధికారులు తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో తన సొంతవూరు హాపూర్ వచ్చిన సతేంద్ర సివాల్‌ను అరెస్టు చేసినట్లు ఆ రాష్ట్ర తీవ్రవాద వ్యతిరేక దళం (ఎటిఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర విదేశాంగ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సమాచారాన్ని పాకిస్థాన్ ఐఎస్ఐ యొక్క ఏజెంట్లకు సివాల్ పంపుతున్నాడని ఎటిఎస్ ఆరోపించింది. న్యూఢిల్లీలో పనిచేసిన సివాల్ 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో 'ఇండియా బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్ (ఐబిఎస్ఎ)గా పని చేస్తున్నారు. పాక్ ఐఎస్ఐ ఏజెంట్లకు సమాచారాన్ని సివాల్ పంపుతున్నాడని ఆరోపించిన ఎటిఎస్, అతను ఏవిధంగా సమాచారాన్ని పంపుతున్నాడనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. హనీ ట్రాప్‌లో చిక్కుకుని లేదా, ఆర్థిక ప్రలోభాలకు గురై సమాచారాన్ని పంపుతున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. మీరట్‌లోని ఫీల్డ్ యూనిట్‌లో ఎటిఎస్ అధికారులు సివాల్‌ను విచారించినా సంతృప్తికరమైన సమాధానాలు రాబట్టలేకపోయారు.

రక్షణపరంగా భారత్‌కు మాస్కో చాలా ముఖ్యమైనది. దేశ సైనిక సామాగ్రిలో ఎక్కువ భాగం అక్కడ నుంచే వస్తుంది. రష్యాతో భారత్ ద్వైపాక్షిక బంధాలు చాలా ధృడంగా ఉన్నాయి. అలాంటి మాస్కోలో ఒక భారత ఉద్యోగి గూఢచార్యానికి పాల్పడ్డాడనే వార్త సంచలనం సృష్టిస్తోంది.

అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో బైడెన్‌కు తొలి విజయం

కొలంబియా : డెమోక్రటిక్ పార్టీ తరపున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో జో బైడెన్ తొలి గెలుపు నమోదు చేశారు. దక్షిణ కరోలినా ప్రైమరీలో శనివారం ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. మిన్నెసోటా ప్రతినిధి డీన్ ఫిలిప్స్, రచయిత మెరియన్ విలియమ్సన్‌పై బైడెన్ గెలుపొందారు. 2020లో అంచనాలను తలకిందులు చేస్తూ దక్షిణ కరోలినా ఓటర్లు తన విజయానికి బాటలు వేశారని బైడెన్ అన్నారు. 2024లోనూ అదే పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ఓటమి తప్పదని అన్నారు.

దక్షిణ కరోలినాలో రిపబ్లికన్లకు మంచి పట్టుంది. ఇక్కడి ఓటర్లలో 26 శాతం నల్లజాతీయులే. దేశం మొత్తం ఓటర్లలో వీరి వాటా 11 శాతం. ఏపీ ఓట్‌క్యాస్ట్ సర్వే ప్రకారం.. గత ఎన్నికల్లో ప్రతి 10 మంది నల్లజాతీయుల్లో 9 మంది బైడెన్‌కు ఓటు వేశారు. తాజా ప్రైమరీలోనూ బైడెన్ గెలుపునకు వారే కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, మంగళవారం నెవాడాలో, ఫిబ్రవరి 27న మిషిగన్, మార్చి 5న పలు రాష్ట్రాల్లో డెమోక్రటిక్ పార్టీ ప్రైమరీలు జరగనున్నాయి.

రఫాలో అర్ధరాత్రి పూట ఇజ్రాయిల్ దాడులు

- 92 మంది మృతి

నెతన్యాహు ప్రభుత్వం రాజీనామా చేయాలని, ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్‌లో శనివారం ఆందోళన చేస్తున్న నిరసనకారులు

జెరుసలేం : గాజాపై ఇజ్రాయిల్ పాశవిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 92 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీయులు తలదాచుకుంటున్న శిబిరంపైనే ఈ దాడుల జరగడం విచారకరం. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆదివారం నాటికి 122 రోజుకు చేరుకున్నాయి. ఇప్పటి వరకూ 27 వేలకు పైగా పాలస్తీనీయులు ఈ దాడుల్లో మరణించారు. వీరిలో పిల్లలు, మహిళలే అధికంగా ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు

మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, జర్మనీల్లో శనివారం జరిగిన ప్రదర్శనల్లో వేలాదిమంది పాల్గొన్నారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెతన్యాహు ప్రభుత్వం రాజీనామా చేయాలని, ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్‌లో శనివారం వేలాదిమంది ఆందోళన నిర్వహించారు.

సిరియా, యెమెన్‌లో 36 లక్ష్యాలపై బాంబు దాడులు

అమెరికా, బ్రిటన్ ఇతర సామ్రాజ్యవాద దేశాలు సిరియా, యెమెన్‌లలో 36 లక్ష్యాలపై వైమానిక, నావికా దాడులు చేశాయి. ఎర్ర సముద్రంలోని నౌకలపై హౌతీ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించడాన్ని సాకుగా చూపి యెమెన్‌లోని ఆరు ప్రదేశాలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. దీనికి అమెరికా మూల్యం చెల్లించుకోకతప్పదని హౌతీలు హెచ్చరించారు. "గాజాపై దురాక్రమణ ఆపేంతవరకు యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా మా సాయుధ పోరాటం కొనసాగుతుందని హౌతీ తిరుగుబాటుదారు గ్రూపు నాయకులొకరు తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్-హమాస్ వివాదం చెలరేగినప్పటి నుంచి పాలస్తీనియన్లకు సంఘీభావంగా యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ఈ ప్రాంతంలో షిప్పింగ్‌పై దాడి చేస్తున్నారు. మొదట్లో ఇజ్రాయెల్ అనుబంధ నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, యెమెన్‌పై సంకీర్ణ దాడులు ప్రారంభించిన తర్వాత హౌతీలు అమెరికా, బ్రిటన్‌కు చెందిన నౌకలపై దాడులకు సిద్ధమయ్యాయి.

బేకరిలో సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు

బేకరీపై ఉక్రెయిన్ దాడి

- 28కు చేరిన మృతుల సంఖ్య

మాస్కో : రష్యాలోని లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌లోని లిసిచాన్స్క్ పట్టణంలోని ఒక బేకరీపై ఉక్రెయిన్ క్షిపణి దాడిలో మృతుల సంఖ్య 28కి చేరుకుంది. ఈ విషయాన్ని ఆ ప్రాంతంలోని ఎమర్జెన్సీ సర్వీసెస్ అధికారులు ఆదివారం వెల్లడించారు. శనివారం రద్దీగా ఉండే సమయంలో ఈ క్షిపణి దాడి జరిగిందని, అమెరికా తయారు చేసిన హెచ్ఐఎంఎఆర్ఎస్ మల్టిపుల్ రాకెట్ లాంచ్ సిస్టమ్ ఉపయోగించి ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఒక చిన్నారితో సహా 28 మంది మరణించారని చెప్పారు. బేకరీ శిథిలాల నుంచి పది మందిని రక్షించామని, వీరు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు.

బేకరీపై ఉక్రెయిన్ అనాగరిక దాడిని ఖండిస్తూ ఆదివారం లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌లో సంతాప దినాన్ని పాటించారు. ఉక్రెయిన్ ఉద్దేశపూర్వంగానే బేకరీపై దాడికి పాల్పడిందని అధికారులు ఆరోపించారు.

పాక్‌ను వెంటాడుతున్న అధిక ధరలు, పేదరికం, సైనిక జోక్యం

- 8న ఎన్నికలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ పార్లమెంటు ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం జోరందుకుంటోంది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు వారం రోజుల వ్యవధిలోనే మూడు శిక్షలు విధించడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. డిసెంబరులో నిర్వహించిన గాలప్ సర్వేలో పాకిస్తాన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తిగా ఇమ్రాన్ నిలిచారు. ధరల పెరుగుదల, పేదరికం, అవినీతి, ఎడాపెడా విద్యుత్ భారాలు, వ్యవస్థీకృత దోపిడీ వంటి ఆర్థిక సమస్యలు ఈ ఎన్నికల్లో ప్రధానంగా ముందుకు వస్తున్నాయి. అలాగే పాక్ రాజకీయాల్లో మితిమీరిన సైనిక జోక్యం , బయటనుంచి అమెరికా ఒత్తిడి, స్వతంత్ర విదేశాంగ విధానం ఇమ్రాన్‌ఖాన్ ఖైదు, రాజకీయ హింస వంటి అంశాలపై కూడా చర్చ జరుగుతోంది. నిర్ణీత గడువు కన్నా నాలుగు నెలలు ఆలస్యం, అనేక రాజకీయ ఒడుదుడుకుల మధ్య ఈ నెల 8న సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి.

పాకిస్తాన్ సైన్యం కనుసన్నల్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని ఏమేరకు ప్రతిబింబిస్తాయన్నది అనుమానమే. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను, ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్- ఇ- ఇన్సాఫ్ (పిటిఐ)ని ఎన్నికల్లో పాల్గొనకుండా ఆ పార్టీ ఎన్నికల గుర్తును తొలగించేశారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ దేశానికి తిరిగి రావడం, పిటిఐ ఎన్నికల గుర్తు లేకపోవడంతో పిఎంఎల్ (ఎన్) విజయావకాశాలు కొంతమేర మెరుగుపడవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ, సెనేట్‌తో కూడిన పార్లమెంటుకు అలాగే, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుగతాయి. జాతీయ అసెంబ్లీలో మొత్తం 336 సీట్లు ఉండగా, వీటిలో 266 స్థానాలకు ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ పద్ధతిలో సింగిల్ మెంబర్ నియోజకవర్గాల ద్వారా ఎన్నికవుతారు. మహిళలకు 60, మైనార్టీలకు 10 సీట్లు రిజర్వు చేయబడ్డాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో ఎన్నుకోబడిన సభ్యులు పార్లమెంటు ఎగువ సభ సెనేట్‌లోని 100 స్థానాలకు ప్రతినిధులను ఎన్నుకుంటారు. మొత్తం 12.8 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 2018లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 50 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

మీ కోసం

ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే మీగడకి టీ స్పూన్ పంచదార కలిపితే తాజాగా ఉంటుంది.

జీవన సౌరభం

ప్రపంచం మారాలని కోరుకోవడం కాదు, ఆ మార్పు మనతోనే మొదలైతే ప్రపంచం అదే మారుతుంది.

బంగారు భూమి

రాయిలాపూర్ పచ్చని పంటలతో విలసిల్లే అందమైన పల్లెటూరు. రామయ్య, రంగమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు. వారికి చదువు అబ్బలేదు. బాధ్యతలు లేకుండా తిరిగేవారు. సోమరులుగా తయారైన పిల్లలను చూసి తల్లిదండ్రులు ఎంతో బాధపడేవారు.

ఒకరోజు పొలం పనిచేస్తున్న రామయ్య కాలు జారి పడిపోయాడు. పెద్ద వయసు అవ్వడం వల్ల ఎముక విరిగింది. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పారు. ఆ మాటలతో రామయ్యకు వ్యవసాయం గురించి దిగులు పట్టుకుంది. ఇద్దరు కొడుకులను దగ్గరకు పిలిచాడు.

'నేను కొన్నాళ్ల పాటు నడిచే పరిస్థితి లేదు. పొలం ఇప్పుడే చదును చేయించాను. విత్తనాలు వేసి, సాగు చేయాలి. ఈలోపు ఇలా జరిగింది. ఈ ఏడాది వ్యవసాయం మీరు చేయాలి.' అని చెప్పగానే కొడుకిలిద్దరూ గట్టిగా నవ్వి 'ఏంటి నాన్నా.. మేము వ్యవసాయం చేయడమేంటి? ఆ పనులు మాకసలు చేతగావు. పైగా అంత కష్టపడడం మా వల్ల కాదు' అన్నారు.

'పొలం పనులు ఎలా చేయాలో నేను చెబుతాను. అలాగే మీకో రహస్యం చెబుతాను. 'ఈ పొలం ఉన్న భూమి చాలా విలువైనది. ఇందులో పంట పండిస్తే బంగారు పండుతుంది' అని మా తాత చెప్పాడు. అందుకే నేను ప్రతి ఏడాది పంట వేస్తున్నాను. బంగారం కోసం ఎదురు చూస్తున్నాను. ఈ ఏడాది మీరు సాగు చేయండి. ఏమో.. ఆ బంగారం మీకే వస్తుందేమో!' అని కొడుకుల వంక ఓరగా చూశాడు.

తండ్రి మాటలు కొడుకులిద్దరికీ బాగా నచ్చాయి. బంగారం అనగానే ఆశ కలిగింది. ఆ ఏడాది కష్టపడి పంట పండించారు. విత్తనాలు చల్లించారు. నీళ్లు పెట్టారు. రేయింబవళ్లు కష్టపడి సాగు చేశారు. కొన్ని రోజులకు పంట చేతికి వచ్చింది. ఏపుగా ఎదిగిన పంట చూసి వారి ఆనందానికి అవధులు లేవు. పంట అమ్మి డబ్బులు తీసుకుని రామయ్య దగ్గరికి వెళ్లారు. 'నాన్నా.. పొలంలో బంగారు పండుతుందని నువ్వు చెబితే ఎంతో ఆశపడి సాగు మొదలుపెట్టాం. కానీ పంట చేతికి వచ్చాక బంగారంపై మోజు పోయింది. అంతేకాదు, నువ్వు చెప్పిన బంగారం ఎదిగిన పంట ఇచ్చే ప్రతిఫలం అని అర్థమైంది. ఇక నుండి మేం ఇద్దరం పొలం పనులు చూసుకుంటాం. నువ్వు విశ్రాంతి తీసుకో' అని చెప్పారు. కొడుకుల్లో వచ్చిన మార్పుకు రామయ్య, రంగమ్మ ఎంతో సంతోషించాడు.

- రాహుల్, 9వ తరగతి,
రాయిలాపూర్, మెదక్ జిల్లా,
94417 62105.

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మల ఆంగ్ల పేర్లను పక్కనే ఉన్న గళ్లల్లో రాయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం. మిగిలినవి మీరు రాయండి.

నేను గీసిన బొమ్మ

లక్ష్మీజ
ఏడవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
హవేళి ఘణపూర్
మెదక్ జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మెరుగైన ఆరోగ్యం కోసం ఆచి తూచి తినాలి ...

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మంచి ఆహారాన్ని తీసుకోవాలి. పోషకాహారం ప్రతిఒక్కరికీ చాలా ముఖ్యం. మరి ఈ పోషకాహారం ఎందులో ఉందో తెలుసుకోవటం అవసరం. కొన్ని రకాల ఆహారాల్లో ఎక్కువ పోషకాలుంటాయి. మరికొన్నింటిలో తక్కువగా ఉంటాయి. ఆయా ఆహారాల కొనుగోలుకు ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టాల్సి కూడా ఉంటుంది. ఖరీదు ఎక్కువ అని పక్కన పెట్టేయకుండా అప్పుడప్పుడైనా మన డైట్‌లో చేర్చుకోవటం మంచిది.

ఎంత ఉరుకులు, పరుగుల జీవితాన్ని గడుపుతున్నా ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అనారోగ్యం బారినపడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలి. శరీరానికి తగినంత విశ్రాంతి ఉండాలి. ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలి. ఏదీ అతిగా చేయకూడదు. తినకూడదు. తాగకూడదు. మనలో చాలామంది ఆకలి వేసినప్పుడు కడుపు నింపుకోవటానికి ఏది అందుబాటులో ఉంటే అది తినేస్తుంటాం. చాలామంది ప్రాసెసింగ్ చేసిన ఆహారాన్ని, వేపుళ్లు (ఫ్రెంచ్ ఫ్రైస్, నూడుల్స్) వంటివి తినేస్తుంటారు. బయట దొరికే ఇలాంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడుతుంటారు. అందువల్ల వీటిని ఎక్కువగా తీసుకుంటే ఇబ్బందులు ఏర్పడతాయి. వీటికి బదులుగా తాజా పండ్లు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయంగా తీసుకుంటే ఆరోగ్యం మెరుగవుతుంది.

స్నాక్స్ కంటే పప్పులు మేలు : ప్రతిరోజూ సాయంత్రం పూట ఏదో ఒక పండును తినటం ఎంతైనా మంచిదే. ఆకలి తీరకపోతే చిప్స్, బిస్కెట్లు, కేకులు, మిర్చీ బజ్జీలు, ఉప్పు కలిపిన పదార్థాలు కొందరు తింటుంటారు. ఇలాంటి వాటికి బదులుగా బాదంపప్పు, పిస్తాపప్పు, జీడిపప్పు, వాల్‌నట్స్ లాంటివి తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవే కాకుండా పెరుగుతో చేసిన పదార్థాలు, మజ్జిగ లాంటివి తీసుకుంటే శరీరానికి ప్రొటీన్లు, మంచి కొవ్వులు లభించి అదనపు శక్తిని ఇస్తాయి. యాపిల్ పండుతోపాటు వాల్‌నట్స్ వంటివి తీసుకుంటే ఆకలితోపాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

పండ్లతో అధిక పోషకలు : ప్రతిఒక్కరూ ఉదయమో, సాయంత్రమో ఏదో ఒక సమయంలో రోజులో ఒకటో రెండో పండ్లు తీసుకోవటం ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. అవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మార్కెట్లో అనేక రకాల పండ్లు అందుబాటులో ఉంటున్నాయి. పండ్లలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వీటితోపాటు విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు దండిగా లభిస్తాయి. మామిడి, బొప్పాయి, అరటి వంటి లేత పసుపు రంగు ఉండే పండ్లలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బత్తాయి,నారింజ వంటి పండ్లతో మంచి ఆరోగ్యం మెరుగుదల అవుతుంది. ఇవి తీసుకుంటే జలుబు చేస్తుందనేది అపోహ మాత్రమే!

మొలకెత్తే గింజలతో అదనపు శక్తి

తాజా పండ్లతోపాటుగా మొలకెత్తిన గింజలు తిన్నా శరీరానికి అదనపు శక్తి చేకూరుతుంది. శాకాహారం తినేవారిలో బీ12 లోపం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు ఉసిరి, క్యారెట్, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్‌ను తీసుకుంటే రకరకాల పోషకాలు శరీరానికి లభిస్తాయి. మొలకెత్తిన గింజలు తినలేని వారు బోధుమగడ్డి జ్యూస్ కూడా తీసుకోవచ్చు.

ఆహారం ఎలా తీసుకోవాలంటే...

శరీరానికి శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవటం మేలు. మోతాదుకు మించి తీసుకోకూడదు. అంటే సరిపడా కేలరీలు ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. ఎన్ని కేలరీలు అవసరమనేది తెలుసుకుని తీసుకోవటం మంచిది. ఎందుకంటే బరువు తక్కువగా ఉన్న వారు ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ బరువు ఉన్న వారు తక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రస్తుత జీవన విధానంలో సాధారణ బరువు ఉండే వారికి ప్రతిరోజు 1600 నుంచి 1800 కేలరీలు ఉండే ఆహారం అవసరం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనునిత్యం తాజాపండ్లతోపాటు డ్రైఫ్రూట్స్, పెరుగు పదార్థాలను తీసుకుంటే శరీరానికి ఫైబర్, ప్రొటీన్లతోపాటు మంచి కేలరీలు అందుతాయని సూచిస్తున్నారు.

కేలరీలను అవసరాన్ని బట్టే తీసుకోవాలి ...

శరీరంలో కేలరీల శాతం ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించుకునేలా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇలాంటి వారు పంచదార, స్వీట్లు, ఫ్రైఫుడ్, కూల్‌డ్రింకులు, కేకులు, ఐస్‌క్రీములు, పిజ్జాలు, బర్గర్లు, ఆల్కాహాల్ వంటివి తీసుకోకూడదు. చిన్న పిల్లలకు పాలిచ్చే తల్లులు, గర్భవతులకు పోషకాలు అధికంగా అవసరం. అందువల్ల వారి ఆహారంలో ఎక్కువ కేలరీలు ఉండేలా చూడాలి. వారు పాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్న వారికి సరిపడా కేలరీలు ఉన్న ఆహారమే ఇవ్వాలి. టీబీ ఉన్న వారు అత్యధిక కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎవ్వరికి వారు తాము చేసే పనిని బట్టి కూడా కేలరీల అవసరం మారుతూ ఉంటుంది. ఎక్కువగా పనిచేసే వారు ప్రతిరోజూ 2200 కేలరీల ఆహారాన్ని తీసుకోవచ్చు.

మితాహారమే మేలు : ప్రతిఒక్కరూ తమ శరీరానికి సరిపడా శక్తి కావాలంటే తినే భోజనంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు సముపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. అతిగా వద్దు. ఏదైనా సరిపడా తీసుకోవటం ఉత్తమం. రోజూ తినే అన్నం, చపాతీలను ఏదో ఒక పప్పుతో కలిపి తీసుకుంటే మంచిది. పిండి పదార్థాలకు ప్రొటీన్‌ను జతచేసినట్లే అవుతుంది.

మాంసాహారంలో అధిక కేలరీలు

శరీరానికి కావాల్సిన కేలరీలు మాంసాహారంలో అధిక మొత్తంలో ఉంటాయి. వీటిలో ఎక్కువగా ఉండే కొవ్వులు శరీరంలోకి చేరతాయి. ఇలా కొవ్వు శరీరంలోకి పేరుకు పోవటం అంత మంచిదికాదు. అందువల్ల వారానికి ఒకటి లేదా రెండుసార్లు తినాలి. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, ఎ,డి, ఇ విటమిన్లు, కొవ్వులు ఉండే కోడిగుడ్లను ఆహారంలో భాగంగా చేసుకోవటం మేలు. బ్రెడ్ కూడా అదనపు బలం కోసం తోడ్పడు తుంది. ఎప్పుడో జ్వరం వచ్చినప్పుడే కాకుండా దీన్ని రోజూ ఆహారంలో చేసుకోవటం కూడా మంచిదే. ప్రతి బ్రెడ్ స్లైస్‌లో 69 కేలరీలు ఉంటాయి.

ఫిబ్రవరిలోనూ పోటాపోటీనే..!

సాధారణంగా సంక్రాంతి, దసరా, ఉగాదికి పండుగల సమయాల్లో విడుదలకు పెద్ద హీరోల సినిమాల మధ్య పోటీ ఉండటం సహజం. కానీ ఈ మధ్య ఎక్కువ సినిమాలు వస్తుండటంతో ప్రతి శుక్రవారం విడుదలయ్యే సినిమాల మధ్యన కూడా పోటీ మొదలైంది. ఏ బడ్జెట్‌లో సినిమాలు తీసినా విడుదలకు క్యూలో ఉంటుండటంతో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండళ్లకు తేదీలను ఖరారు చేయటంతోపాటుగా వివాదాలను పరిష్కరించటం కూడా పెద్ద సమస్యగా మారుతోంది. సంక్రాంతి బరిలో సినిమాలకు ఇలాంటి పోటీనే రాగా, తాజాగా ఈనెల తొమ్మిదో తేదీన విడుదలయ్యే సినిమాల మధ్య కూడా పోటీ నెలకొంది. వేరే సినిమాల కోసం తాము వాయిదాలు వేసుకుంటూ పోతే వాణిజ్యపరంగా నష్టపోతామంటూ నిర్మాతలు, దర్శకులు, హీరోలు సైతం బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

సంక్రాంతి పండుక్కే 'బరి'లో నిలవాల్సిన సినిమాల్లో కొన్నింటిని థియేటర్లు లేనికారణంగా ఫిబ్రవరికి విడుదలను వాయిదా వేయాల్సి వచ్చింది. అప్పట్లో ఈగల్, డిజె టిల్లు స్క్వేర్, ఊరు పేరు భైరవకోన వంటి సినిమాలు కూడా విడుదలకు సిద్ధమయ్యాయి. వీటితోపాటుగా తెరపైకి వచ్చి పోటీలో గుంటూరు కారం, సైంధవ్, నా సామిరంగా, హను-మాన్ విడుదలయ్యాయి. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి, సినీ నిర్మాతల మండలిలు చేసిన కృషి ఫలితంగా 'ఈగల్' సినిమా ఈనెల తొమ్మిదో తేదీకి వాయిదా పడింది. సంక్రాంతికి అనుకున్నా తన సొంత సినిమా 'ఫ్యామిలీస్టార్'ను ముందుగానే దిల్‌రాజు ఏప్రిల్ 5కు వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. హీరోగా విజయ్ దేవరకొండ, హీరోయిన్‌గా మృణాల్‌ఠాకూర్ నటస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరిలోనూ మరోసారి 'ఈగల్'కు పోటీ రావటంతో విడుదల కోసం మరోసారి ఫిలిం ఛాంబర్‌ను ఆ సినిమా నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఇటీవల ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే అదేరోజున 'ఊరు భైరవకోన', 'టిల్లు స్క్వేర్' సినిమాలు విడుదల చేస్తామంటూ ఆయా చిత్రాల నిర్మాతలు కూడా ప్రకటించటంతో మళ్లీ తెలుగు చిత్రవాణిజ్య మండళ్ల జోక్యం చేసుకోవాల్సివచ్చింది. తమకిచ్చిన 'సోలో రిలీజ్ డేట్' మాటను నిలబెట్టుకోవాలని ఛాంబర్‌ను సదరు నిర్మాణ సంస్థ కోరింది. ఇదిలావుండగా తాను నటించిన 'ఊరు భైరవకోన' సినిమా విడుదల తేదీని మార్చేది లేదని నటుడు సందీప్‌కిషన్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ ఈవెంట్‌లో వెల్లడించారు. తమ సినిమా కూడా అదేరోజు విడుదల చేసేస్తామని ప్రకటించారు. అయితే నిర్మాతల మండలి కోరిక మేరకు 16వ తేదీకి వాయిదా పడినట్లు సమాచారం. 'ఈగల్' సినిమా కూడా అదే రోజున విడుదలవుతుందనేది తెలియదనీ, తాము కూడా మొదట్లో సంక్రాంతికే విడుదల చేయాలని అనుకున్నామనీ, చాలా సినిమాలు ఉండటం చూసి ఫిబ్రవరికి వెళ్లామని చెప్పుకొచ్చారు. పెద్దల జోక్యంతో హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం 'డిజె టిల్లు స్క్వేర్'ను చిత్రాన్ని మార్చి 29న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది. డిజె టిల్లుకు సీక్వెల్‌గా ఈ సినిమా వస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి సినిమాల్లో మొదటిస్థానంలో హను-మాన్ నిలవగా, రెండోస్థానంలో నా సామిరంగ సినిమాలు నిలిచాయి. ఆ తర్వాత స్థానాల్లో గుంటూరు కారం, సైంధవ్ ఆడాయి. రాజ్‌తరుణ్ హీరోగా, హీరోయిన్‌గా మాల్వి మల్హోత్ర నటిస్తూ ఎఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'తిరగబడర సామీ' ఈనెల 23న విడుదల కానుంది. సోహెల్ టైటిల్‌రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్ అండ్ కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండి పాషా నిర్మించిన చిత్రం 'బూట్‌కట్ బాలరాజు ఈనెల రెండోతేదీన విడుదలైంది. యష్ పూరి హీరోగా, అపూర్వ రావ్ హీరోయిన్‌గా నటించిన



చిత్రం 'హ్యాపీ ఎండింగ్' కూడా అదేరోజు విడుదలైంది. హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్‌కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహించారు. ఈ రెండు సినిమాలు ఓ మోస్తరుగా ఆడుతూనే ఉన్నాయి. కోలీవుడ్‌లో వడకుప్పట్టి రామస్వామి, డెవిల్, మరక్కుమా నెంజం, చిక్లెట్స్ సినిమాలు కూడా ఈనెల రెండోతేదీన ఒకేరోజు పోటీగా విడుదలయ్యాయి.

ముగించేదెవరు?

- భారత్‌కు 9 వికెట్లు, ఇంగ్లాండ్‌కు 332 పరుగులు
- రసవత్తరంగా విశాఖ టెస్టు మ్యాచ్
- శుభ్‌మన్ గిల్ శతక జోరు
- భారత్ రెండో ఇన్నింగ్స్ 255/10
- ఛేదనలో ఇంగ్లాండ్ 67/1
- విశాఖ టెస్టు మూడో రోజు

విశాఖ టెస్టు సమరం రసవత్తరంగా మారింది. భారత్ ఇద్దరు బ్యాటర్లు శతక మోత మోగించినా, ఓ పేసర్ ఆరు వికెట్లతో విజృంభించినా ఇంగ్లాండ్ ఇంకా మ్యాచ్ రేసులోనే నిలిచింది. 399 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనలో రెండోసారి బ్యాట్ పట్టిన స్టోక్స్‌సేన.. ప్రస్తుతం 67/1తో ఆడుతుంది. రెండో టెస్టులో విజయానికి ఆతిథ్య భారత్‌కు 9 వికెట్లు అవసరం కాగా, ఇంగ్లాండ్‌కు 332 పరుగులు అవసరం. బజ్‌బాల్, స్పిన్‌బాల్ నేపథ్యంలో విశాఖ టెస్టులో నేడే ఫలితం తేలనుంది!.

యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (104) ఎట్టకేలకు ఫామ్ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో సహచరులు నిరాశపరిచిన వేళ సెంచరీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. అక్షర్ పటేల్ (45) సైతం రాణించటంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లు గొప్ప బంతులేమీ వేయకపోయినా క్రమశిక్షణ లోపించిన బ్యాటింగ్‌తో టీమ్ ఇండియా వికెట్లు చేజార్చుకుంది.

ప్రజాశక్తి - విశాఖపట్నం

శుభ్‌మన్ గిల్ (104, 147 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగాడు. ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడి చేసిన శుభ్‌మన్ గిల్ దూకుడుగా పరుగులు పిండుకున్నాడు. 11 ఫోర్లు, 2 సిక్సర్లతో శతక విన్యాసం చేశాడు. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (45, 84 బంతుల్లో 6 ఫోర్లు) సైతం ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 78.3 ఓవర్లలో 255 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ స్పిన్నర్ టామ్ హార్ట్లీ (4/77) నాలుగు వికెట్ల మాయజాలం ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్ 143 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్.. ఇంగ్లాండ్‌కు 399 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇక ఛేదనలో ఇంగ్లాండ్ 67/1తో ఆడుతోంది. ఓపెనర్లు జాక్ క్రాలీ (29 బ్యాటింగ్, 50 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (28, 27 బంతుల్లో 6 ఫోర్లు) అదిరే ఆరంభాన్ని అందించారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి జాక్ క్రాలీతో పాటు నైట్‌వాచ్‌మన్ రెహాన్ అహ్మద్ (9 బ్యాటింగ్) అజేయంగా నిలిచాడు. రెండో టెస్టులో విజయానికి టీమ్ ఇండియా 9 వికెట్ల దూరంలో నిలువగా, ఇంగ్లాండ్‌కు మరో 332 పరుగులు అవసరం.

శతక శుభ్‌మన్ : ఇటీవల వరుస మ్యాచుల్లో నిరాశపరుస్తున్న యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (104) ఎట్టకేలకు గాడిలో పడ్డాడు. విశాఖ పిచ్‌పై ఇంగ్లాండ్ బౌలర్లపై ఆకట్టుకునే సెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (209) ద్వి శకతంతో టీమ్ ఇండియా భారీ స్కోరు సాధించగా.. రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను శుభ్‌మన్ గిల్ ఆదుకున్నాడు. ఇక ఓవర్‌నైట్ స్కోరు 28/0తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (13) ఒక్క పరుగూ జోడించకుండానే అండర్సన్ ఓవర్లో వికెట్ కోల్పోయాడు. యశస్వి జైస్వాల్ (17) సైతం అండర్సన్ ఓవర్లోనే నిష్క్రమించాడు. ఒక్క పరుగు వ్యవధిలో ఓపెనర్లను చేజార్చుకున్న భారత్ 30/2తో ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ (29) ఇన్నింగ్స్‌కు నిలబెట్టారు. ఈ జోడి మూడో వికెట్‌కు 112 బంతుల్లో 80 పరుగులు జోడించింది. 8 ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిసిన శుభ్‌మన్ గిల్ 60 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. అయ్యర్, గిల్ జోరుతో 25.3 ఓవర్లలో భారత్ 100 పరుగుల మార్క్ చేరుకుంది. క్రీజులో కుదరుకున్నట్టే కనిపించిన శ్రేయస్ అయ్యర్ మరోసారి నిరాశపరిచాడు. హార్ట్లీ మాయలో పడి వికెట్ కోల్పోయాడు. అరంగ్రేట ఆటగాడు రజత్ పటీదార్ (9)ను రెహాన్ అహ్మద్ వెనక్కి పంపించాడు. 122/4తో టీమ్ ఇండియా కష్టాల్లో కూరుకుంది. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ (45) ఈసారి గిల్‌కు అండగా నిలిచాడు. ఆరు ఫోర్లతో మెరిసిన అక్షర్ పటేల్.. గిల్ తోడుగా ఐదో వికెట్‌కు 151 బంతుల్లో 89 పరుగుల విలువైన భాగస్వామం నిర్మించాడు. 11 ఫోర్లు, రెండు సిక్సర్లతో 132 బంతుల్లో కెరీర్ మూడో సెంచరీ సాధించిన శుభ్‌మన్ గిల్ సైతం.. బషీర్ ఓవర్లో నిష్క్రమించాడు. అర్ధ సెంచరీ ముంగిట అక్షర్ పటేల్ నిష్క్రమించటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. టెయిలెండర్లలో రవిచంద్రన్ అశ్విన్ (29, 61 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ నిలువలేదు. శ్రీకర్ భరత్ (6), కుల్దీప్ యాదవ్ (0), జశ్‌ప్రీత్ బుమ్రా (0) తేలిపోయారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లాండ్ స్పిన్నర్ టామ్ హార్ట్లీ నాలుగు వికెట్లు పడగొట్టగా.. రెహాన్ అహ్మద్ (3/88), జేమ్స్ అండర్సన్ (2/29) రాణించారు.

ఛేదనలో దూకుడు : 399 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఇంగ్లాండ్ బజ్‌బాల్ దూకుడుతో మొదలెట్టింది. మూడో రోజు ఆట చివరి సెషన్లో 14 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 4.78 రన్‌రేట్‌తో ఏకంగా 67 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (29 నాటౌట్), బెన్ డకెట్ (28) దంచికొట్టారు. డకెట్ ఆరు బౌండరీలతో విరుచుకుపడగా, క్రాలీ సైతం మూడు ఫోర్లు ఓ సిక్సర్‌తో చెలరేగాడు. దీంతో 10.5 ఓవర్లలోనే ఆ జట్టు తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించింది. ఆఖర్లో అశ్విన్ మాయకు బెన్ డకెట్ పెవిలియన్‌కు చేరినా.. నైట్ వాచ్‌మన్ రెహాన్ అహ్మద్ (9 నాటౌట్) తోడుగా క్రాలీ సాధించాల్సిన లక్ష్యాన్ని కాసింత కుదించాడు. 14 ఓవర్ల ధనాధన్‌తో ఇంగ్లాండ్ 67 పరుగులు పిండుకుని, మరో లక్ష్యానికి 332 పరుగుల దూరంలో నిలిచింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 396/10

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 253/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) రూట్ (బి) జైస్వాల్ 17, రోహిత్ శర్మ (బి) అండర్సన్ 13, శుభ్‌మన్ గిల్ (సి) ఫోక్స్ (బి) బషీర్ 104, శ్రేయస్ అయ్యర్ (సి) స్టోక్స్ (బి) హార్ట్లీ 29, రజత్ పటీదార్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ అహ్మద్ 9, అక్షర్ పటేల్ (ఎల్బీ) హార్ట్లీ 45, శ్రీకర్ భరత్ (సి) స్టోక్స్ (బి) రెహాన్ అహ్మద్ 6, కుల్దీప్ యాదవ్ (సి) డకెట్ (బి) హార్ట్లీ 0, జశ్‌ప్రీత్ బుమ్రా (సి) బెయిర్‌స్టో (బి) హార్ట్లీ 0, ముకేశ్ కుమార్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 3, మొత్తం : (78.3 ఓవర్లలో ఆలౌట్) 255.

వికెట్ల పతనం : 1-29, 2-30, 3-111, 4-122, 5-211, 6-220, 7-228, 8-229, 9-255, 10-255.

బౌలింగ్ : జేమ్స్ అండర్సన్ 10-1-29-2, షోయబ్ బషీర్ 15-0-58-1, రెహాన్ అహ్మద్ 24.3-5-88-3, జో రూట్ 2-1-1-0, టామ్ హార్ట్లీ 27-3-77-4.

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ నాటౌట్ 29, బెన్ డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28, రెహాన్ అహ్మద్ నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 1, మొత్తం : (14 ఓవర్లలో వికెట్ నష్టానికి) 67.

వికెట్ల పతనం : 1-50.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 5-1-9-0, ముకేశ్ కుమార్ 2-0-19-0, కుల్దీప్ యాదవ్ 4-0-21-0, రవిచంద్రన్ అశ్విన్ 2-0-8-1, అక్షర్ పటేల్ 1-0-10-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68